RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

**రాహుల్ కేరళ నుంచి ఎందుకు పోటీ చేశారు**

యూపి నుంచి రాజ్యసభ దక్కడం గౌరవమే 2

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 87 | ఏప్రిల్ 16 గురువారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 87 | April 16 Thursday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |

## పారదర్శకతను పెంచేడమే లక్ష్యం

### మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



హైదరాబాద్ జనసంఘర్షణ

తెలంగాణ రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుల అభివృద్ధి, పారదర్శకతను పెంచే లక్ష్యంతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మార్కెటింగ్ మరియు మార్క్‌ఫెడ్ అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. గత రెండేళ్లలో రూ. 568.50 కోట్ల

## నేటి నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

### మహిళా రిజర్వేషన్ల బిల్లు... డిలిమిటేషన్ బిల్లు కీలక నిర్ణయాలు

న్యూఢిల్లీ జనసంఘర్షణ

మహిళా రిజర్వేషన్ల అమలు మరియు నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకునేందుకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు జరగనున్న ఈ సమావేశాలు వాడీవేడిగా సాగే అవకాశం ఉంది. మహిళా రిజర్వేషన్లను 2029 నాటికి అమలులోకి తీసుకురావడానికి, కేంద్ర ప్రభుత్వం 131వ రాజ్యాంగ సవరణ బిల్లు-2026ను ప్రవేశపెట్టనుంది. దీని కోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 55, 81, 82, 170, 330, 332 మరియు 334ఏలలో సవరణలు ప్రతిపాదించింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం 2026 తర్వాత వచ్చే తొలి జనాభా లెక్కల ఆధారంగానే డీలిమిటేషన్ జరగాల్సి ఉండగా, ఈ బిల్లు ద్వారా ఆ నిబంధనను సవరించి, త్వరగా ఈ ప్రక్రియను పూర్తి చేసి మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ డీలిమిటేషన్ ప్రక్రియ ద్వారా లోక్‌సభ స్థానాల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం దాదాపు 50 శాతం సీట్ల పెంపును ప్రతిపాదిస్తుండటంతో, ప్రస్తుతం ఉన్న 543 స్థానాలు సుమారు



## మీసేవలపై ఏసీబీ దాడులు

హైదరాబాద్ జనసంఘర్షణ

తెలంగాణ వ్యాప్తంగా మీసేవ కేంద్రాల్లో జరుగుతున్న అక్రమ వసూళ్లపై ఏసీబీ (అవినీతి నిరోధక శాఖ) అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. పౌర సేవల కోసం వచ్చే సామాన్యుల నుంచి మీసేవ సిబ్బంది, దళారుల ద్వారా అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారనే విస్తృత ఆరోపణల నేపథ్యంలో ఖైరతాబాద్, అంబర్‌పేట్, అల్వాల్ వంటి పలు ప్రాంతాల్లోని మీసేవ కేంద్రాల్లో ఏసీబీ అధికారులు ఆకస్మిక సోదాలు నిర్వహించారు. కుల, ఆదాయ, నివాస, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల వంటి అత్యవసర సేవలకు ప్రభుత్వం నిర్ణయించిన నామమాత్రపు ఫీజులు రూ. 45 కాగా, మీసేవ కేంద్రాల్లో దరఖాస్తుదారుల నుంచి రూ. 500 నుంచి రూ. 1000 వరకు వసూలు చేస్తున్నట్లు సోదాల్లో వెలుగుచూసింది. అంతేకాకుండా, నిబంధనల ప్రకారం హైదరాబాద్ జిల్లా మినహా ఇతర

## అండమాన్ సముద్రంలో ఘోర రోడ్డు ప్రమాదం

### 25 0 మంది మృతి

న్యూఢిల్లీ జనసంఘర్షణ

అండమాన్ సముద్ర తీరంలో జరిగిన ఘోర పడవ ప్రమాదంలో దాదాపు 250 మంది గల్లంతయ్యారు. రోహింగ్యా శరణార్థులు మరియు బంగ్లాదేశ్ పౌరులతో ప్రయాణిస్తున్న ఈ పడవ మలేసియాకు వెళ్తుండగా



## కాల్పుల విరమణను పొడగించలేం

### ట్రంప్ కీలక వ్యాఖ్యలు



వాషింగ్టన్ జనసంఘర్షణ

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందంపై కీలక ప్రకటన చేశారు. ప్రస్తుత కాల్పుల విరమణ గడువును పొడిగించే ఉద్దేశం తమకు లేదని, తాము కేవలం శాశ్వత శాంతి ఒప్పందం వైపే మొగ్గు చూపుతున్నామని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్‌తో చర్చలు కొనసాగుతున్నప్పటికీ, కాల్పుల విరమణను పునరుద్ధరించకుండానే అవి ముగిసే అవకాశం ఉందని ట్రంప్ పేర్కొన్నారు. ఏప్రిల్ 21తో ప్రస్తుత కాల్పుల విరమణ గడువు ముగియనున్న నేపథ్యంలో, ఇరాన్‌తో శాశ్వత ఒప్పందం కుదిరితేనే అది అందరికీ మేలు చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## అమెరికా ఆర్థిక వ్యవస్థలో వలసదారుల పాత్ర కీలకం

న్యూఢిల్లీ జనసంఘర్షణ

అమెరికా ఆర్థిక వ్యవస్థలో వలసదారుల పాత్రపై ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. అమెరికా పౌరసత్వం పొందడం అంటే కేవలం ఇక్కడ నివసించడం మాత్రమే కాదని, దేశ ప్రయోజనాలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడమని ఆయన స్పష్టం చేశారు. అదే సమయంలో ఇమిగ్రేషన్ ప్రోగ్రామ్‌లపై కఠిన నిబంధనలు ఉండాలని వాదిస్తూనే, హెచ్-1బీ వీసా వ్యవస్థలో జరుగుతున్న మోసాలను ఆయన అడ్డుకోవాలని సూచించారు. జార్జియా యూనివర్సిటీలో జరిగిన ఒక కార్యక్రమంలో భారత సంతతికి చెందిన వ్యక్తి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, ఆయన తన వ్యక్తిగత జీవితాన్ని ఉదాహరణగా చూపారు. తన భార్య ఉషా చిలుకూరి భారత్ నుంచి వలస వచ్చిన కుటుంబానికి చెందినవారని, తన అత్తమామలంటే తనకు ఎంతో గౌరవమని వాన్స్ పేర్కొన్నారు. 1980ల్లో ఆంధ్రప్రదేశ్



## మహిళాబిల్లుకు మద్దతిస్తాం

### కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లిఖార్జున ఖర్గే



న్యూఢిల్లీ జనసంఘర్షణ

కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న మహిళా రిజర్వేషన్లు మరియు డీలిమిటేషన్ బిల్లులపై కాంగ్రెస్ పార్టీ తన వ్యూహాన్ని ఖరారు చేసింది. ఢిల్లీలో మల్లికార్జున ఖర్గే నివాసంలో జరిగిన 'ఇండియా' కూటమి సమావేశం అనంతరం, మహిళా రిజర్వేషన్లకు తాము మద్దతు ఇస్తున్నామని, అయితే డీలిమిటేషన్ బిల్లును మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఖర్గే స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ల పేరుతో దొంగదారిన డీలిమిటేషన్ ప్రక్రియను అమలు చేసి, రాజకీయ ప్రయోజనాలు పొందేందుకు కేంద్రం కుట్ర చేస్తోందని ఆయన ఆరోపించారు. కనీసం జనాభా లెక్కలు కూడా పూర్తి చేయకుండానే హడావుడిగా ఈ నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శించిన ఆయన, డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో తామంతా ఐక్యంగా ఓటు వేస్తామని తెలిపారు. రాజ్యాంగబద్ధమైన అధికారాలను కార్యనిర్వాహక వర్గం తన చేతుల్లోకి తీసుకోవాలని చూడటం, ప్రతిపక్షాలను అణచివేయడమే లక్ష్యంగా పెట్టుకోవడం సరికాదని పేర్కొన్నారు. 2029 ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలనే ఉద్దేశంతో, లోక్‌సభ స్థానాలను 850కి పెంచేందుకు కేంద్రం చేస్తున్న ప్రతిపాదనలను, అలాగే ఆ ప్రక్రియను డీలిమిటేషన్‌తో ముడిపెట్టడాన్ని ప్రతిపక్షాలు గట్టిగా వ్యతిరేకిస్తున్నాయి. కొత్త జనాభా లెక్కల ఆధారంగానే డీలిమిటేషన్ ప్రక్రియ జరగాలని, అప్పటి వరకు ఈ బిల్లును ఆమోదించకూడదని ఇండియా కూటమి డిమాండ్ చేస్తోంది.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
16 గురువారం, ఏప్రిల్ 2026

## నేటి నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

**మొదటిపేజీ తరువాయి..** 816కి చేరుకోవచ్చని అంచనా. ఈ పునర్విభజన ప్రక్రియను పర్యవేక్షించడానికి సుప్రీంకోర్టు ప్రస్తుత లేదా మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో ఒక డీలిమిటేషన్ కమిషన్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇందులో కేంద్ర ఎన్నికల సంఘం ప్రతినిధులు, రాష్ట్రాల ఎన్నికల అధికారులు సభ్యులుగా ఉంటారు. ఈ కమిషన్ దేశవ్యాప్త నియోజకవర్గాల విభజనతో పాటు, పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ (గ్రాశీఖ) స్థానాల పునర్విభజనపై కూడా దృష్టి సారించనుంది. అయితే, ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న బిల్లు స్వరూపాన్ని, ముఖ్యంగా డీలిమిటేషన్ ప్రక్రియను విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ క్రమంలో అధికార, విపక్షాల మధ్య సభలో తీవ్ర వాదోపవాదాలు జరిగే అవకాశం కనిపిస్తోంది.

# అండమాన్ సముద్రంలో ఘోర రోడ్డు ప్రమాదం

**మొదటిపేజీ తరువాయి..** ప్రమాదానికి గురైంది. ఐక్యరాజ్యసమితి శరణార్థుల హైకమిషనర్ మరియు ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ తెలిపిన వివరాల ప్రకారం, ఈ పడవ ఏప్రిల్ 4న బంగ్లాదేశ్‌లోని టేక్నాఫ్ ప్రాంతం నుండి బయలుదేరింది. ప్రయాణ మార్గంలో బలమైన ఈదురుగాలులు, భారీ అలల ఉద్ధృతికి తోడు, పడవలో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించడం ఈ ప్రమాదానికి ప్రధాన కారణాలని ప్రాథమికంగా గుర్తించారు. గల్లంతైన వారిలో చిన్న పిల్లలు కూడా ఉన్నట్లు సమాచారం అందడంతో, సముద్రంలో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నారు. 2017లో మయన్మార్‌లోని సైనిక దాడుల నుండి తప్పించుకుని బంగ్లాదేశ్‌లోని కాక్స్ బజార్ శరణార్థి శిబిరాలకు చేరుకున్న రోహింగ్యాలు, అక్కడ కనీస జీవన సౌకర్యాలు లేక, మెరుగైన జీవితం కోసం ప్రమాదకరమైన సముద్ర ప్రయాణాలను ఆశ్రయిస్తూ ఇలాంటి దురదృష్టకర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.

## పారదర్శకతను పెంచేడమే లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి..**

వ్యయంతో 630 అభివృద్ధి పనులను ప్రభుత్వం మంజూరు చేయగా, అందులో రూ. 128 కోట్ల విలువైన 113 పనులు పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. మిగిలిన పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని, ప్రతి పనికి నిర్దిష్ట టైమ్‌లైన్లను అనుసరించాలని మంత్రి ఆదేశించారు. ముఖ్యంగా మార్కెట్ యార్డుల్లో వ్యాపారం నిర్వహించకుండా లైసెన్సులను అక్రమంగా కొనసాగిస్తున్న 'జీరో బిజినెస్' ట్రేడర్ల విషయంలో మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి వారి లైసెన్సులను రద్దు చేయాలని, వారికి సహకరించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మార్కెట్ యార్డుల అభివృద్ధి పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక డ్యాష్‌బోర్డును ఏర్పాటు చేయాలని సూచించిన మంత్రి, గడ్డిఅన్నారం మార్కెట్‌లో అమల్లో ఉన్న 'స్మార్ట్ మార్కెట్ యార్డ్' డిజిటలైజేషన్ విధానం విజయవంతమైతే, దానిని రాష్ట్రవ్యాప్తంగా అన్ని మార్కెట్లకు విస్తరిస్తామని తెలిపారు. కోహెడ పండ్ల మార్కెట్ అభివృద్ధి పనులకు త్వరలో టెండర్లు పిలవనున్నట్లు వెల్లడించారు. మరోవైపు, విద్యుత్ వ్యయాన్ని తగ్గించేందుకు సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టులను వేగవంతం చేసి జూలై చివరి నాటికి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రానున్న పంట కొనుగోలు సీజన్లలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లకు అవసరమైన తార్పాలిన్లు, తేమ కొలిచే యంత్రాలు, డ్రైయర్లను సిద్ధంగా ఉంచాలని, రైతుల ఖాతాల్లోకి నేరుగా నగదు జమ చేసేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

# మీసేవలపై ఏసీబీ దాడులు

**మొదటిపేజీ తరువాయి..**

ప్రాంతాల్లో సెల్ఫ్ డిక్లరేషన్ అఫిడవిట్ అవసరం లేకపోయినప్పటికీ, ఆ పేరుతో అదనపు డబ్బులు దండుకోవడం, ప్రతి మీసేవ కేంద్రంలో తప్పనిసరిగా ఉండాల్సిన ధరల పట్టికను (సిటిజన్ చార్ట్) పారదర్శకంగా ప్రదర్శించకపోవడం వంటి అనేక అక్రమాలను అధికారులు గుర్తించారు. టెక్నాలజీతో పౌర సేవలను సులభతరం చేయాల్సిన మీసేవ కేంద్రాలు, క్షేత్రస్థాయిలో బాధ్యతారహితంగా వ్యవహరిస్తూ ప్రజలను దోచుకుంటున్నాయని ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో, అదనపు వసూళ్లకు పాల్పడే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్న ఉన్నతాధికారులు, ప్రజలు ఎవరైనా ఇలాంటి దోపిడీని ఎదుర్కొంటే వెంటనే 1100 లేదా 18004251110 నంబర్లకు కాల్ చేసి సమాచారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# కాల్పుల విరమణను పొడగించలేం

**మొదటిపేజీ తరువాయి..** రాజధాని ఇస్లామాబాద్ వేదికగా జరగనున్న తదుపరి చర్చలపై ఆశాభావం వ్యక్తం చేసిన ట్రంప్, ఆ చర్చలు చాలా కీలకమని వ్యాఖ్యానించారు. ఇరాన్‌లో గతంలో ఉన్న అతివాద శక్తులు పోయి, కొత్త పాలన వచ్చిందని, అటువంటి కొత్త పాలకులతో కలిసి పనిచేసేందుకు అమెరికా సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు.

## వడగాలులు, ఎండలతో జాగ్రత్త

**పిడుగులతో కూడిన వర్షాల సమయంలో ఇంటివద్దనే ఉండాలి..**

**తుఫాన్లు వరదల సమయంలో అంటువ్యాదులతో జాగ్రత్త**

**ఇంటి పరిసరాలు అనేవి ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచుకోవాలి..**

**ప్రకృతి విపత్తుల నుండి కాపాడుకోవడానికి సూచనలు తప్పక పాటించాలి..**

**- రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్**

**విజయవాడ, ఏప్రిల్15 :** ఎండ తీవ్రతకు, వడగాల్పులకు గురి కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రాణహాని నుండి కాపాడుకోవచ్చునని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలియజేసారు. తలనొప్పి, తలతిరగడం, తీవ్రమైన జ్వరం కలిగి ఉండడం, మత్తు నిద్ర, కలవరింతలు, ఫిట్స్ వంటివి వడదెబ్బ లక్షణాలుగా గుర్తించాలని ఆయన చెప్పారు. వడగాల్పుల నుండి రక్షణ కొరకు టోపీ, రుమాలు, తెలుపు రంగు కాటన్ వస్త్రాలను వినియోగించాలన్నారు. కళ్ల రక్షణ నిమిత్తం నాణ్యమైన సన్ గ్లాసెస్ వినియోగించాలన్నారు. ఇంటివాతావరణం చల్లదనం కోసం ఇంటి పై కప్పులపై వైట్ పెయింట్, కూల్ రూఫ్ టెక్నాలజీ, క్రాస్ వెంటిలేషన్, థర్మోకోల్ ఇన్సులేషన్ వంటి అంశాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మేడపై మొక్కలు, ఇండోర్ ప్లాంట్స్ భవనాలను చల్లగా ఉంచుతాయని చెప్పారు. మొక్కలు ఉష్ణ తాపాన్ని తగ్గిస్తాయని సూచించారు. ఇంటి పరిసరాల్లో మొక్కలు పెంచడం ద్వారా వేడి గాలుల నుండి ఉపశమనం లభించి చల్లని వాతావరణం అలముకుంటుందని చెప్పారు. వర్షం పడిన సమయంలో పిడుగుపాటుకు గురి కాకుండా తక్షణం జాగ్రత్తలు తీసుకోవాలని అయన సూచించారు. ఉరుములతో కూడిన వర్షం పడే సమయంలో ఇంటిలోనే ఉండాలని ఆయన సూచించారు. ఉరుముల సమయంలో సముద్రము, కొలనులు, చెరువుల దగ్గర ఉంటే వెంటనే దూరంగా వెళ్లాలన్నారు. రేకు లోహము కలిగిన నిర్మాణాలకు దూరంగా ఉండాలన్నారు. ఉరుముల శబ్దం వినగానే పొలాల్లో పనిచేసే రైతులు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసేవారు, పశువుల కాపరులు, గొర్రెల కాపరులు వెంటనే సురక్షితమైన ప్రదేశాలకు వెళ్లాలన్నారు. కారు, బస్సు లోపల ఉన్నవారు వెంటనే అన్ని డోర్స్ మూసివేయాలి. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం ఉన్నప్పుడు మెడవెనుక జుట్టు నిక్క బొడవడం లేదా చర్మం జలదరింపు ఉంటె మెరుపు పిడుగు రావడానికి సూచనగా భావించాలి. బహిరంగ ప్రదేశాల్లో ఉండి సురక్షిత ప్రదేశాలకు వెళ్లే అవకాశం లేకుంటే రబ్బరు చెప్పులు ధరించి చెవులు మూసుకుని తలను నేలకు తగలకుండా మోకాలిపై కూర్చోవాలన్నారు. దీనివల్ల ఉరుములు మెరుపులు నుండి రక్షణ పొందవచ్చునని చెప్పారు. ఉరుముల సమయంలో ఇంట్లో ఉన్నట్లయితే కిటికీలు తలుపులు మూసివేయాలి. ఉరుముల శబ్దం ఆగిపోయిన తర్వాత కూడా 30 నిమిషాల వరకూ ఇంట్లోనే ఉండి రక్షణ పొందాలని సూచించారు. పిడుగు బాధితులను తాక వచ్చునని చెప్పారు. సత్వరమే వారికి సహాయం అందించవచ్చునని చెప్పారు. పిడుగు బాధితుని వెంటనే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించాలని సూచించారు. ఉరుములు మెరుపులు సంభవించినపుడు చెట్ల క్రింద, చెట్ల సమీపంలో, టవర్లు, చెరువుల దగ్గర ఉండరాదన్నారు. ఎలెక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇతర పరికరాలు, ఛార్జ్ డ్ ఫోన్స్, మొబైల్ ఫోన్స్ వినియోగించరాదన్నారు. పిడుగులా సమయంలో స్నానం చేయడం, చేతులు కడగడం, నీటిలో ఉండడం లాంటివి చేయరాదన్నారు. మోటారు సైకిళ్ళు, ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు, వ్రేలాడుతున్న విద్యుత్ తీగలకు, విద్యుత్ స్తంభాలకు ఇతర ఇనుప వస్తువులకు దూరంగా ఉండాలన్నారు. వాహనంలో ఉండి ఉంటే లోహపు భాగాలను తాకరాదన్నారు. ఎండ తీవ్రత నుండి కాపాడుకోవడానికి గాను వీలైనంత వరకూ ఇంట్లో ఉండాలి. తరుచూ నీటిని త్రాగుతూ ఉండాలి. ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజు, ఓఆర్ఎస్ కలిపిన నీటిని త్రాగాలి. తరుచూ వాతావరణం సమాచారం తేలుకుంటూ ఉండాలి అందులకు గాను న్యూస్ అనేది వాచ్ చేయాలి. ఎండలో నుండి వచ్చిన వెంటనే నీరు, నిమ్మరసం, కొబ్బరి నీరు వంటివి తీసుకోవాలి. ఎండలో బయటకు వచ్చినపుడు తలతిరుగుట, వాంతులు, ఇతర అనారోగ్య సమస్యలు ఏర్పడితే వెంటనే దగ్గరలోని వైద్యుని సంప్రదించాలన్నారు. ఇంటి వాతావరణం చల్లగా ఉంచుకోవాలి. ఫ్యాన్ వాడాలి. చల్లని నీటితో స్నానం చేయాలి. ఎండలో గొడుగు లేకుండా తిరగరాదు. నలుపురంగు మందంగా ఉండే దుస్తులు ధరించరాదు. ఎండ సమయంలో శారీరక శ్రమతో కూడిన పనులు చేయరాదు. బాలింతలు, వృద్దులు, చిన్నపిల్లలు ఎండ సమయంలో బయట సంచరించరాదు. వీరిపై ఎండ ప్రభావం కనపడే అవకాశం ఉంటుంది. శరీరాన్ని డీ హైడ్రేట్ చేసే ఆల్కహాల్, టీ, కాఫీ, కార్బోనేటేడ్ శీతల పానీయాలు మానుకోవాలి. అధిక ప్రోటీన్, ఉప్పు, కారం, నూనె ఉండే పదార్థాలు తీసుకోరాదు. ప్రకాశించే బల్బులను వినియోగించడం మానుకోవాలి. అవి అనవసరపు వేడిని విడుదల చేస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలియజేసారు. తుఫాన్, వరదల సమయంలో టెలివిజన్ రేడియో ఇతర ప్రసార మాధ్యమాల ద్వారా సమాచారం అందుకున్న వెంటనే ప్రమాద స్థలం వదిలి సురక్షిత ప్రాంతాలకు వెళ్ళాలి. తుఫాన్ వరదల సమయంలో ముందుగానే విలువైన వస్తువులు, పత్రాలు, నగదుతో సురక్షిత ప్రదేశంలో తలదాచుకోవాలి. సహాయక చర్యల్లో పాల్గొనే అధికారులకు సహకరించాలన్నారు. ప్రభుత్వ సూచనలు అందుకున్న పిమ్మట మాత్రమే ఇళ్లకు తిరిగి వెళ్లాలన్నారు. తుఫాన్ లు వరదల తర్వాత అంటువ్యాదులు నిరోధించడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తుఫాన్ లు, వరదల సమయంలో కాల్వలకు వంతెనలకు అడ్డుపడిన చెత్తను తొలిగించాలి. సముద్ర నదీతీర ప్రాంతాలకు వెళ్ళరాదు. చేపల వేటను మానుకోవాలి. నదులు దాటే ప్రయత్నం చేయరాదు. పాడుపడిన ఇళ్ళు చెత్తా చెదారం నుండి దూరంగా ఉండాలి. విద్యుత్ పరికరాలను వినియోగించరాదు. వరద నీటి ద్వారా వచ్చే విష జ్వరాల నుండి జాగ్రత్తలు తీసుకోవాలి. అంటువ్యాదులు వ్యాపించకుండా వరదనీరు కలుషిత నీరు నుండి దూరంగా ఉండాలి. ఇళ్లకు ఉన్న పగుళ్ళను పరిశీలించి తదుపరి లోపలకు వెళ్ళాలి. ఇంట్లో ఉన్న విద్యుత్ ఉపకరణములు ఆఫ్ చేయాలి. తడిచిన విద్యుత్ వస్తువులు తాకరాదు. ప్రకృతి విపత్తులు అయిన ఎండలు, వడగాలులు, తుఫాన్ లు, వరదలు, పిడుగులు, ఉరుములతో కూడిన వర్షాలు సమయంలో అత్యంత జాగరూకత వహించాలని ఆయా సమయాల్లో విపత్తుల నిర్వహణ సంస్థ వారు జారీ చేసిన రక్షణ చర్యలను పాటించాలని అప్పుడు ప్రాణాపాయం నుండి రక్షించుకోవచ్చునని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలియజేసారు.

## పేలిన గ్యాస్ సిలిండర్లు

**నలుగురు మృత్యువాత**

**శ్రీ సత్య సాయి, ఏప్రిల్15 :** కదిరి రూరల్ మండలం కుమ్మరవాండ్లపల్లి గ్రామంలోని ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్లు పేలాయి. ఈ ప్రమాదంలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో పది మంది తీవ్రంగా గాయపడ్డారు. గ్యాస్ మంటలు చుట్టు పక్కల వ్యాపించడంతో భారీ ప్రమాదం జరిగింది. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. ఫైర్ సిబ్బంది మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో గాయపడిన వారిని వెంటనే కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం ధాటికి ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. గాయపడిన వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని సమాచారం. ఘటనా స్థలిలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. గ్యాస్ మంటలు వేగంగా వ్యాపించడంతో స్థానికులు భయపడి బయటకు పరుగులు తీశారు.

## రాహుల్ కేరళ నుంచి ఎందుకు పోటీ చేశారు

**యూపి నుంచి రాజ్యసభ దక్కడం గౌరవమే**

**డబ్బుల మూటలతో రేవంత్ రాజకీయం**

**మహిళా రిజర్వేషన్లపై విమర్శలు తగవు**

**రేవంత్ వ్యాఖ్యలపై బిజెపి ఎంపి లక్ష్మణ్ ఆగ్రహం**

**న్యూఢిల్లీ, ఏప్రిల్15 :** తెలంగాణ రాష్ట్ర హక్కుల కోసం తన గొంతు వినిపిస్తున్నానని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్ తెలిపారు. తెలంగాణ కోసం సీఎం రేవంత్ రెడ్డి ఏమైనా చేశారా? అని ఆయన ప్రశ్నించారు. తుపాకీ పట్టుకొని ఆయన ఎవరి పక్కన నిలుచున్నారో అందరికీ తెలుసునన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ కేరళ నుంచి ఎందుకు పోటీ చేశారంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నిలదీశారు. ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఎన్నిక కావ్వడం తెలుగు వాడిగా తనకు గౌరవంగా ఉందన్నారు. తనపై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో బుధవారం న్యూఢిల్లీలో ఎంపీ కె. లక్ష్మణ్ స్పందించారు. నీతులు చెబుతున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. మహిళల అవకాశాలను దెబ్బ తీయడానికి కుట్ర పన్నుతున్నారంటూ విపక్షాలపై ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు. మహిళల వాటా తగ్గించడానికి ప్రయత్నిస్తున్నారా?, ఎస్సీ, ఎస్టీ వాటా అడ్డుకోవడానికి కుట్ర పన్నుతున్నారా? అంటూ విపక్షాలకు ఆయన ప్రశ్నలు సంధించారు. సీఎం రేవంత్ రెడ్డికి ప్రజాస్వామ్యం అంటే డబ్బే అని వ్యంగ్యంగా అన్నారు. ఢిల్లీకి ఆయన డబ్బుల మూటలు మోశారని విమర్శించారు. నగదు కేంద్రంగా రాజకీయం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. డబ్బున్న వాళ్ళకి ఓటు విలువ ఎక్కువ అనేలా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్య హాస్యాస్పదంగా ఉందని లక్ష్మణ్ పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌ను మూడు ముక్కలు చేశారని మండిపడ్డారు. జీహెచ్ఎంసీ పరిధిలో150 సీట్లను 300 సీట్లు చేశారని పేర్కొన్నారు. ఏ శాస్త్రీయ పద్ధతిలో గ్రేటర్ హైదరాబాద్‌ను విభజించారంటూ సీఎంను ఆయన సూటిగా ప్రశ్నించారు. డీలిమిటేషన్ బిల్లు వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగకుండా ప్రస్తుతం ఉన్న సీట్ల నిష్పత్తికి అనుగుణంగా అవి పెరుగుతాయని ఎంపీ లక్ష్మణ్ తెలిపారు. 543 సీట్లలో మహిళా రిజర్వేషన్లు పెంచమనడం వెనుక ఎస్సీ, ఎస్టీ మహిళలకు నష్టం చేయాలన్న కుట్ర దాగి ఉందని అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీకి పెరుగుతున్న ఆదరణ చూసి జీర్ణించుకోలేక పోతున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. అందుకే డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లుల పట్ల రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటనలు చేస్తున్నారంటూ ప్రతిపక్ష పార్టీల నేతలపై ఆయన విరుచుకు పడ్డారు. జీఎస్డీపీ ప్రకారం డీలిమిటేషన్ చేయాలన్నది కాంగ్రెస్ విధానమా? అనేది స్పష్టం చేయాలని ఆ పార్టీ నేతలను ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఓటు విలువ ధనిక, పేద అనే వ్యత్యాసం లేకుండా అందరికీ సమానంగా ఉంటుందని అభిప్రాయ పడ్డారు. జీడీపీలో మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు ముందు వరుసలో ఉన్నాయని గుర్తు చేశారు. తెలంగాణ వ్యతిరేక ప్రతిపాదన చేస్తున్నారని వెంటనే దీనిని వెనక్కి తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డికి ఆయన స్పష్టం చేశారు.

# అమరావతి పేరులోపై స్పష్టత

**అమరావతి, ఏప్రిల్15 :** ఏపీ రాజధాని అమరావతి పేరుపై స్పష్టత ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు. ఇక నుంచి అన్ని అధికారిక నోట్‌లు అమరావతి ఇంగ్లీషులో చివరన టిఐ పేరుతోనే ఉండాలని స్పష్టం చేశారు. కొందరు టిఐ బదులు టిహెచ్ఐ అని రాయడాన్ని తప్పుబట్టారు. అమరావతిని ఇంగ్లీష్‌లో రాసేటప్పుడు చివరిలో టిహెచ్ఐ కి బదులుగా టిఐ ఉండాలని తెలిపారు. అన్ని జిల్లాల కలెక్టర్లకు, అధికారులకు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక



# ‘అశుద్ధం’ తొలగించే బతుకుల్లో ‘అన్యాయం’ ఎన్నాళ్ళు

- **‘మున్సిపల్ గొంతుక’ వినోద్ కుమార్.. చెత్తకుప్పల్లో చిక్కుకున్న బతుకుల కోసం అలుపెరగని పోరాటం!**
- **పట్టణ శుద్ధి కోసం ప్రాణాలొడ్డిన సైనికులకు అండగా.. అన్యాయంపై ఎలుగెత్తుతున్న వినోద్ కుమార్ మిట్టగడుపుల**

ఇల్లందు ఏప్రిల్ 15 (జన సంఘర్షణ)

నగరం నిద్రలేవక ముందే.. సూర్యుడు తన కిరణాలను భూమిపై ప్రసరింపజేయక ముందే.. మురికి కూపాల్లోకి దిగి సమాజాన్ని శుద్ధి చేసే అదృశ్య సైనికులు పారిశుద్ధ్య కార్మికులు. వారి శ్రమలో స్వార్థం లేదు, కానీ వారి జీవితాల్లో మాత్రం భద్రత లేదు. ఈ చేదు నిజాన్ని పాలకుల గడప దాకా తీసుకెళ్తూ, కార్మికుల పక్షాన నిలబడి పోరాడుతున్న పేరు వినోద్ కుమార్ మిట్టగడుపుల (సిఐటియు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు). గత మూడు దశాబ్దాలుగా పారిశుద్ధ్య రంగంలో నెలకొన్న స్తబ్దతను, కార్మికుల పట్ల జరుగుతున్న వివక్షను ఆయన తన గళం ద్వారా ప్రశ్నిస్తూనే ఉన్నారు.



**చీకటి బతుకుల్లో వెలుగు కోసం..**

“ప్రభుత్వాలు మారుతున్నాయి, పాలకులు మారుతున్నారు.. కానీ పారిశుద్ధ్య కార్మికుడి తలరాత మాత్రం మారడం లేదు” అంటూ వినోద్ కుమార్ వ్యక్తం చేస్తున్న ఆవేదన అక్షర సత్యం. మూడు దశాబ్దాల క్రితం జరిగిన పర్మినెంట్ ప్రక్రియ తర్వాత, నేటికీ వేల సంఖ్యలో కార్మికులు ‘కాంట్రాక్ట్’ అనే బంధనాల్లోనే చిక్కుకొని ఉండటంపై ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. నోటిఫికేషన్లు లేని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేని ఈ ఉద్యోగాల్లో మగ్గుతున్న వారికి ‘పర్మినెంట్’ హోదా కల్పించడమే తన ప్రధాన లక్ష్యంగా ఆయన పోరాటాన్ని సాగిస్తున్నారు.

**కరోనా కాలపు ‘నిజమైన హీరోలకు’ గుర్తింపు ఏది?**

వినోద్ కుమార్ తన విశ్లేషణలో కరోనా కాలాన్ని ఒక కీలక మలుపుగా గుర్తు చేస్తున్నారు. కన్న బిడ్డలే తల్లిదండ్రుల శవాలను తాకడానికి భయపడి పారిపోయిన వేళ, తన ప్రాణాలను పణంగా పెట్టి అంత్యక్రియలు నిర్వహించిన మున్సిపల్ కార్మికుల త్యాగాన్ని ఆయన కొనియాడుతున్నారు. “ఆనాడు పూల వర్షం కురిపించిన పాలకులు, నేడు వారి కడుపు కొడుతుంటే చూస్తూ ఊరుకోలేం” అని ఆయన హెచ్చరిస్తున్నారు. దుర్వాసన భరించలేని సమాజంలో, రోజూ అదే దుర్గంధంతో సహవాసం చేస్తూ అకాల మరణాల పాలవుతున్న కార్మికుల కుటుంబాలకు భరోసా కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆయన కుండబద్దలు కొడుతున్నారు.

ఒక్కరోజు మున్సిపల్ కార్మికులు పని ఆపితే పట్టణం ఏమవుతుందో ఊహించుకోవడానికే భయం వేస్తుంది. అటువంటి అత్యవసర సేవలు అందించే కార్మికులను గాలికొదిలేయడం నాగరికత అనిపించుకోదు. వినోద్ కుమార్ మిట్టగడుపుల నేతృత్వంలో సాగుతున్న ఈ పోరాటం కేవలం జీతాల కోసమో, అలవెన్సుల కోసమో కాదు.. అది కార్మికుడి ఆత్మగౌరవం కోసం, వారి పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి, ఈ ‘మట్టి మనుషుల’ బతుకుల్లో వెలుగు నింపాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు.

మనం అద్దాల మేడల్లో కూర్చుని పరిశుభ్రత గురించి మాట్లాడుతాం. కానీ ఆ మేడల కింద ఉన్న మురికిని శుభ్రం చేసే చేతులు మాత్రం ఆకలితో వణుకుతున్నాయి. వినోద్ కుమార్ లేవనెత్తిన ప్రశ్నలు కేవలం ప్రభుత్వానికే కాదు, సమాజం మొత్తానికి. మనం పీల్చే స్వచ్ఛమైన గాలి వెనుక ఒక కార్మికుడి ఊపిరితిత్తులు పాడవుతున్నాయి. ఆ రుణాన్ని మనం ఎలా తీర్చుకుంటాం? వారికి కనీస ఉద్యోగ భద్రత కల్పించడంలో మనం చూపే జాప్యం, వారి శ్రమను అవమానించడమే అవుతుంది.

# భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో పసిప్రాణం బలి..

- **ప్రభుత్వ వైద్యానికి మాయని మచ్చ!**
- **వైద్యో నారాయణో ‘మృత్యు’ రూపా?:**

భద్రాచలం ఏప్రిల్ 15 (జన సంఘర్షణ)

ఏజెన్సీ ప్రాంత ప్రజల పాలిట సంజీవనిగా నిలవాల్సిన భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, నేడు పసిప్రాణాల పాలిట మృత్యుకూపంగా మారుతోందా అనే అనుమానాలు కలగక మానవు. ములుగు జిల్లా వెంకటాపురం మండలానికి చెందిన ఆకుల సంజీవరాణి అనే గర్భిణీ, నొప్పులతో అల్లాడుతూ తనకు సిజేరియన్ చేయాలని ప్రాధేయపడినా.. కనీసం వైద్యుల పర్యవేక్షణ లేకుండా కేవలం నర్సులే ప్రసవం చేయడం వల్ల మగ శిశువు ఉమ్మనీరు తాగి మృతి చెందడం అత్యంత హేయమైన చర్య. గడిచిన జనవరి నెలలో జరిగిన శిశు మరణాలపై ఐటీడీఏ పీవో స్వయంగా విజిట్ చేసి, సిబ్బందికి మెమోలు జారీ చేసినా.. మూడు నెలలు తిరగకముందే అదే తరహా నిర్లక్ష్యం పునరావృతం కావడం అధికారుల పర్యవేక్షణ లోపానికి నిలువుటద్దం పడుతోంది. గతంలో జిల్లా కలెక్టర్, పీవోల సతీమణులు సైతం ఇక్కడే ప్రసవాలు చేయించుకుని సామాన్యుల్లో ప్రభుత్వ వైద్యంపై పెంచిన నమ్మకాన్ని, ఇటువంటి అమానవీయ ఘటనలు అడుగడుగునా దెబ్బతీస్తున్నాయి. మాతా శిశు మరణాల నివారణకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం, ఏజెన్సీ ప్రాంతంలోని ఆసుపత్రుల్లో ‘నిర్లక్ష్యపు నీడలు’ తొలగించకపోతే.. పేదవాడికి ప్రాణవాయువు అందేది ఎక్కడ? వైద్యం పేరిట జరుగుతున్న ఈ ‘నిశ్శబ్ద హత్యలకు’ బాధ్యత ఎవరిది? అని సీనియర్ వైద్య నిపుణులు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు. చట్టం మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తుందా లేక మెమోలతోనే సరిపెడుతుందా అనేది వేచి చూడాలి.





# న్యాయం చేయాలంటూ ప్రియుడి ఇంటి ముందు బైఠాయించిన యువతి

- **తల్లి సహా యువతిపై దాడి**
- **ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు**

ఇల్లందు ప్రతినిధి:( జన సంఘర్షణ)

ఇల్లందు: ప్రేమ పేరుతో మోసం చేశాడని ఆరోపిస్తూ ప్రియుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఒక యువతి అతని ఇంటి ముందు బైఠాయించిన ఘటన ఇల్లందు మండలం బాలాజీ తండాలో ఉద్రిక్తతకు దారితీసింది. వివరాల్లోకి వెళ్తే మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం రేగుల తండాకు చెందిన యువతి, బాలాజీ తండాకు చెందిన యువకుడితో పరిచయం పెంచుకుని ప్రేమలో పడింది. పెళ్లి చేస్తానని నమ్మబలికి తరువాత మోసం చేసి పెళ్లికి నిరాకరించినట్లు బాధితురాలు ఆరోపిస్తోంది. దీంతో మనస్తాపానికి గురైన యువతి, తన తల్లితో కలిసి ప్రియుడి ఇంటి ముందు బైఠాయించి న్యాయం చేయాలని డిమాండ్ చేసింది. ఈ సమయంలో అక్కడికి చేరుకున్న యువకుడి కుటుంబ సభ్యులు యువతి, ఆమె తల్లిపై దాడి చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. “నా మీద మాత్రమే కాకుండా, నాతో వచ్చిన నా తల్లిపై కూడా దాడి చేశారు” అని బాధిత యువతి ఆవేదన వ్యక్తం చేసింది. ఈ ఘటనతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనపై గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొనగా, బాధితురాలికి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



# నాడు పారిశ్రామిక సిరులు.. నేడు వెలవెలబోతున్న వీధులు

- **కళతప్పిన ‘జంట’ నగరాల దీనగాథ!**

కొత్తగూడెం ఏప్రిల్ 15 (జన సంఘర్షణ)

ఒకప్పుడు వేలాదిమంది కార్మికుల కోలాహలంతో, నిరంతర సైరన్ల మోతతో పారిశ్రామిక రాజధానిగా వెలుగొందిన కొత్తగూడెం, పాల్వంచ జంట నగరాలు నేడు నిశ్శబ్ద రోదనలో మునిగిపోయాయి. సింగరేణి గనుల భూగర్భ గర్భంలో బొగ్గు నిల్వలు కరిగిపోవడంతో గనులు మూతపడటం, దశాబ్దాల పాటు వెలుగులు పంచిన కేటీపీఎస్ పాత ప్లాంట్ల కూల్చివేత ఈ ప్రాంత ఆర్థిక వెన్నెముకను విరిచేశాయి. వేల కుటుంబాల బదిలీలతో నగరం ఖాళీ అవుతుంటే, దాని సెగ ఇటు రియల్ ఎస్టేట్ రంగానికి, అటు చిరువ్యాపారులకు తగిలి మార్కెట్లు కుదేలవుతున్నాయి. కార్పొరేషన్ హోదా వచ్చినా, అది కేవలం కాగితాలకే పరిమితమైందే తప్ప క్షేత్రస్థాయిలో మౌలిక వసతుల కరువు, కొత్త పరిశ్రమల లేమి స్థానికులను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. ఒకప్పుడు వేలాది మందికి ఉపాధినిచ్చిన ఈ నేల, ఇప్పుడు తన ఉనికిని కాపాడుకోవడానికి కొత్త ప్రాజెక్టుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి రావడం పాలకుల నిర్లక్ష్యమా లేక కాలగమనంలో కనుమరుగవుతున్న పారిశ్రామిక వైభవమా అని మేధావులు ప్రశ్నిస్తున్నారు.



# పందుల ఫామ్‌పై మూడో నోటీసు..యజమాని నిర్లక్ష్యం

- **గుంపెల్లగూడెంలో ప్రజల ఆగ్రహ జ్వాలలు**
- **మూసివేయకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామంటూ గ్రామస్తుల హెచ్చరిక**

సింగరేణి ప్రతినిధి:( జన సంఘర్షణ)

ఖమ్మం జిల్లా సింగరేణి మండలం గుంపెల్లగూడెం గ్రామంలో కొనసాగుతున్న పందుల ఫామ్ హౌస్‌పై అధికారులు ఈరోజు మూడోసారి నోటీసు జారీ చేశారు. ఫామ్ వల్ల గ్రామంలో దుర్వాసన, అస్వచ్ఛత అధికమై ప్రజలు రోగాల బారిన పడుతున్నారని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదులు అందడంతో సర్పంచ్ కృష్ణవేణి, పంచాయతీ సెక్రెటరీ, ఉప సర్పంచ్ శంకర్ కలిసి ఫామ్ యజమానికి మూడోసారి నోటీసులు అందజేశారు. అయినప్పటికీ యజమాని ఎలాంటి స్పందన చూపకపోవడం, అధికారుల హెచ్చరికలను పట్టించుకోకపోవడం గ్రామ ప్రజల్లో తీవ్ర ఆగ్రహాన్ని రగిలిస్తోంది. “మా ఆరోగ్యంతో ఆటలాడుతున్న ఈ ఫామ్‌ను వెంటనే మూసివేయాలి... లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతాం” అంటూ గ్రామస్తులు ఘాటుగా హెచ్చరిస్తున్నారు. పిల్లలు, వృద్ధులు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కఠిన చర్యలు తీసుకుని ఫామ్ హౌస్‌ను తక్షణమే మూసివేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారే అవకాశముందని గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు.







# ఖమ్మం గడ్డపై గులాబీ గర్జన

- **రాజకీయ ముఖచిత్రాన్ని మార్చనున్న ‘మినీ ప్లీనరీ’!**

కొత్తగూడెం ఏప్రిల్ 15 (జన సంఘర్షణ)

ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయాల్లో మరో కీలక ఘట్టానికి వేదిక సిద్ధమవుతోంది. ఈ నెల 19న సాయంత్రం 5 గంటలకు ఖమ్మం మమత కాలేజీ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న బి ఆర్ ఎస్ ‘మినీ ప్లీనరీ’ కేవలం ఒక పార్టీ సమావేశం మాత్రమే కాదు, ఆ పార్టీ భవిష్యత్తు కార్యాచరణకు దిశానిర్దేశం చేసే ఒక రాజకీయ వేదికగా కనిపిస్తోంది. పార్టీ ఆవిర్భవ దినోత్సవానికి ముందుగా నిర్వహిస్తున్న ఈ భేటీకి ముఖ్యఅతిథిగా పార్టీ ట్రబుల్ షూటర్, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు హాజరవుతుండటం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. మారుతున్న రాజకీయ సమీకరణల నేపథ్యంలో, క్షేత్రస్థాయి కేడర్‌లో నూతనోత్సాహాన్ని నింపడమే లక్ష్యంగా ఈ సభ రూపుదిద్దుకుంటోంది. ప్రజా సమస్యలపై పోరాట పటిమను ప్రదర్శించాల్సిన తరుణంలో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుండి మాజీ ప్రజాప్రతినిధులు, మండల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, సోషల్ మీడియా వారియర్స్ ఐక్యమత్యంతో కదలాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పార్టీ అస్థిత్వాన్ని చాటడమే కాకుండా, రాబోయే సవాళ్లను ఎదుర్కోవడానికి ఈ ప్లీనరీ ఒక బలమైన పునాదిగా నిలుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. సుజాతనగర్ మండల అధ్యక్షులు లావుడ్యా సత్యనారాయణ నాయక్ పిలుపు మేరకు కార్యకర్తలు ఏ స్థాయిలో తరలివచ్చి ఈ సభను విజయవంతం చేస్తారో చూడాలి.




# ఎస్సైను సస్పెండ్ చేయాలంటూ ఆందోళనకు దిగిన గ్రామస్తులు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏప్రిల్ 15 జన సంఘర్షణ

దమ్మపేట పోలీస్ స్టేషన్ వద్ద బుధవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎస్ఐ సాయికిషోర్ రెడ్డిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ బాధితులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. దాదాపు గంటకు పైగా పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహిస్తూ పోలీస్‌లను నిలదీశారు. ఇటీవల దురదపాడు గ్రామ శివారులో పేకాట స్థావరాలపై పోలీసులు నిర్వహించిన దాడి నేపథ్యంలో ఈ వివాదం చెలరేగింది. ఆ దాడిలో కొందరిని అదుపులోకి తీసుకొని నగదు, వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అయితే కేసులో పట్టుబడిన వారిపై పోలీసులు అమానుషంగా ప్రవర్తించారని బాధితులు ఆరోపించారు. పేకాట కేసులో ఉన్న వారిని కోర్టుకు హాజరు చేయాల్సిన సమయంలో భౌతికంగా దాడులకు పాల్పడ్డారని, అలాగే కేసుతో సంబంధం లేని ఓ అనారోగ్య వ్యక్తిని కూడా వేధించారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన దురదపాడు కాలనీ యువకులు రోడ్డుపై బైఠాయించి, ఎస్సై పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న అశ్వరావుపేట సిఐ దమ్మపేట చేరుకొని మధ్యవర్తిత్వం చేసినప్పటికీ పరిస్థితి చక్కబడలేదు. అనంతరం సంఘటన స్థలానికి చేరుకున్న పాల్వంచ డియస్పీ సతీష్ కుమార్ పూర్తి స్థాయి విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. మొదట బాధితులు ఒప్పుకోకపోయినా, ఎస్సైపై కేసు నమోదు చేస్తామని డియస్పీ స్పష్టంగా చెప్పడంతో ఆందోళన తాత్కాలికంగా విరమించారు. ఎస్సై పై కేసు నమోదు చేస్తారో లేదు వేచి చూడాలి.






# నిప్పుల కొలిమిలో ‘ఉమ్మడి’ ఖమ్మం జిల్లా

- **ఏప్రిల్‌లోనే సెగలు.. మే నెలను తలపిస్తున్న భగభగలు!**

కొత్తగూడెం ఏప్రిల్ 15 (జన సంఘర్షణ)

మునుపెన్నడూ లేని విధంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. సాధారణంగా మే నెలలో కనిపించే ‘అగ్నిధారలు’ ఈసారి ఏప్రిల్‌లోనే మొదలవ్వడం ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. మంగళవారం నాటి లెక్కలు చూస్తే.. భద్రాద్రిలో 42 డిగ్రీలు, ఖమ్మంలో 40 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదై జిల్లాను ఒక ‘నిప్పుల గుండం’గా మార్చేశాయి. కేవలం ఎండ పెరగడమే కాదు, అది ప్రాణాలను హరిస్తుండటం ఇప్పుడు కలకలం రేపుతోంది; ఖమ్మంలో ఇప్పటికే ముగ్గురు వడదెబ్బకు బలికావడం భవిష్యత్తుపై భయాందోళనలను పెంచుతోంది. “అకాల ఎండల వెనుక పర్యావరణ విధ్వంసం ఉందా? లేక ప్రకృతి హెచ్చరికలా?” అని ఆలోచింపజేసేలా ఉష్ణోగ్రతలు పెరుగుతున్న తరుణంలో, మధ్యాహ్నం వేళ జనసంచారం లేక వీధులు కర్ఫ్యూను తలపిస్తున్నాయి. కనీస జాగ్రత్తలు పాటించకపోతే మున్ముందు మే నెలలో పరిస్థితి మరింత భీభత్సంగా ఉండే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో.. అప్రమత్తత ఒక్కటే మనల్ని కాపాడగలదు.



జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం · తెలుగు దినపత్రిక
గురువారం 16 ఏప్రిల్ 2026


# బీసీ బాలికల వసతి గృహంలో ఎనిమిదో తరగతి విద్యార్థిని మృతి

- విద్యార్థిని మృతి పట్ల అనుమానాలు ఉన్నాయని కుటుంబ సభ్యులు, బంధువుల ఆరోపణ
- మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆధ్వర్యంలో ధర్నా రాస్తారోకో
- విద్యార్థిని కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు 25 లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించాలని డిమాండ్
- ఆందోళనకారులకు ఎంత నచ్చ చెప్పిన వినకపోవడంతో అరెస్టు చేసి ట్రాఫిక్ క్లియర్ చేసిన పోలీసులు




**ఎల్లారెడ్డి,ఏప్రిల్ 15 -(జన సంఘర్షణ )**

కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహంలో ఎనిమిదో తరగతి విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీసీ బాలికల వసతి గృహంలో నస్రుల్లాబాద్ మండలం హాజీపూర్‌కు చెందిన రాపాని శ్రావణి (13) అనే విద్యార్థిని స్థానిక బీసీ బాలికల వసతి గృహంలో ఉంటూ ఎల్లారెడ్డి పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతుంది. ఆమె బుధవారం తెల్లవారుజామున వసతి గృహం వరండాలో పడి మృతి చెందింది. శ్రావణి తెల్లవారుజామున వాష్ రూమ్ కోసం వెళ్లి వస్తుండగా వరండాలో పడి మృతి చెందినట్లు అనుమానిస్తున్నారు. వరండాలో విద్యార్థిని పడిపోవడాన్ని గమనించిన వసతి గృహం సిబ్బంది... చికిత్స నిమిత్తం ఆమెను హుటాహుటిన ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ శ్రావణిని పరిశీలించిన వైద్యులు అప్పటికే శ్రావణి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆర్డీవో ప్రభాకర్, బాన్సువాడ డిఎస్పి విట్టల్ రెడ్డి, తహశీల్దార్ ప్రేమ్ కుమార్, సీఐ రాజిరెడ్డి, ఎస్సై మహేష్ ఆస్పత్రికి చేరుకున్నారు. అనంతరం విచారణ నిమిత్తం వసతిగృహానికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. నస్రుల్లాబాద్ మండలం హాజీపూర్‌నకు చెందిన శ్రావణి కి తండ్రి లేకపోవడంతో వసతి గృహంలో ఉండి నాలుగేళ్లుగా చదువుకుంటున్నట్లు విద్యార్థులు తెలిపారు. శ్రావణి తల్లి, అన్న, అక్క హైదరాబాద్ లో పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అందరితో కలుపుగోలుగా ఉండే శ్రావణి మృతి చెందడంతో హాస్టల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. విద్యార్థిని తనకు తానే పడి చనిపోయిందా.. లేక గుండెపోటుతో చనిపోయిందా?అనే వివరాలు తెలియాల్సి ఉంది. ఈ విషయమై అధికారులు వైద్యులతో విద్యార్థులతో చర్చిస్తున్నారు. అయితే వసతిగృహంలో నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థిని మృతి చెందిందని ఆరోపిస్తూ హాజీపూర్ గ్రామస్థులు నిరసన వ్యక్తం చేశారు. వారంతా స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చారు. సమగ్ర విచారణ చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



వసతి గృహంలో ఎనిమిదో తరగతి చదివే విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం పట్ల ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు, అధిక సంఖ్యలో ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్కు చేరుకున్నారు. అలాగే బిజెపి, బీఆర్ఎస్ పార్టీల నేతలు, కార్యకర్తలు సైతం పోలీస్ స్టేషన్కు చేరుకున్నారు. విద్యార్థిని కుటుంబానికి తగు న్యాయం చేయాలని లేని పక్షంలో ఆందోళన చేస్తామని వారు పేర్కొంటూ అధికారులకు కొంత సమయం ఇస్తున్నామన్నారు. సుమారు రెండు గంటలు గడిచిన అధికారుల నుండి ఎలాంటి సమాధానం రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ స్థానిక మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ నాయకత్వంలో మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు, బీఆర్ఎస్, బిజెపి నాయకులు, కార్యకర్తలు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై సుమారు రెండు గంటల పాటు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే సురేందర్ డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని, ప్రభుత్వం వెంటనే 25 లక్షల రూపాయల ఎక్స్గ్రేషియా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. రాస్తారోకోతో ప్రధాన రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. రాస్తారోకో విరమించాలని ఎస్సై మహేష్, సీఐ రాజిరెడ్డి లు సర్దిచెప్పినా ఆందోళన విరమించలేదు. బాలికల వసతిగృహంలో కనీస వసతులు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాచ్‌మన్ లేకపోవడం, సీసీ కెమెరాలు పనిచేయక పోవడం, రాత్రిపూట హాస్టల్లో వార్డెన్ లేకపోవడం వల్లే ఈ దుర్ఘటన సంభవించిందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే విద్యార్థిని మృతి చెందిందని ఆరోపించారు. రాస్తారోకోతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడడంతో బాన్సువాడ డీఎస్పీ విఠల్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మాజీ ఎమ్మెల్యే సురేందర్, మృతురాలి కుటుంబ సభ్యులకు రాస్తారోకో విరమించాలని కోరినా వారు విరమించకపోవడంతో ఆందోళన కారులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి నిజాంసాగర్, పిట్లం, జుక్కల్, భిక్కనూరు పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ విఠల్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థిని మృతికి సంబంధించిన పోస్టుమార్టం రిపోర్ట్ వచ్చాకే మాట్లాడతామని, అనంతరం సమగ్ర విచారణ చేస్తామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక పోలీసులు పేర్కొన్నారు.

# డిజిటల్ బాటలో అంగన్‌వాడీలు

- 'స్మార్ట్' సేవలతోనే పారదర్శకత.. ప్రతి చిన్నారి బడికి చేరాలన్నదే లక్ష్యం!

**ఇల్లందు ఏప్రిల్ 15 (జన సంఘర్షణ)**



గ్రామీణ స్థాయిలో తల్లీబిడ్డల ఆరోగ్యం, విద్యా వికాసాలకు పునాది వేసే అంగన్‌వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కీలక పిలుపునిచ్చారు. బుధవారం బాలాజీ నగర్ పంచాయతీ పరిధిలో సీడీపీఓ అరుణ కుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేసిన ఆయన, ఆధునిక సాంకేతికత ద్వారానే ప్రభుత్వ పథకాల్లో పారదర్శకత సాధ్యమని స్పష్టం చేశారు. కేవలం పరికరాల పంపిణీతో సరిపెట్టకుండా, గర్భిణీలకు, చిన్నారులకు అందే పోషకాహారం క్షేత్రస్థాయిలో దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని ఆయన నొక్కి చెప్పారు. "రాష్ట్రంలో ఏ ఒక్క చిన్నారి చదువుకు దూరం కాకూడదు.. ప్రతి బిడ్డ బడిబాట పట్టాలి" అని ఆయన చేసిన వ్యాఖ్యలు, విద్యారంగంలో రాబోయే మార్పులకు సంకేతంగా నిలిచాయి. అయితే, ప్రభుత్వం అందిస్తున్న ఈ 'స్మార్ట్' ఫోన్లు కేవలం డాటా ఎంట్రీలకే పరిమితం కాకుండా, మారుమూల తండాల్లోని పోషకాహార లోపాన్ని నిజంగానే అరికట్టగలవా? యంత్రాంగం చూపిస్తున్న ఈ ఉత్సాహం క్షేత్రస్థాయిలో ఎంతవరకు సత్ఫలితాలనిస్తుందో వేచి చూడాలి.

# రక్షణ కవచమా.. రాక్షసత్వమా? దమ్మపేటలో దళితుటడిపై పోలీసు ప్రతాపం..

- ఖాకీ దాష్టీకంపై వెల్లువెత్తుతున్న ఆగ్రహం!



**దమ్మపేట ఏప్రిల్ 15 (జన సంఘర్షణ)**

చట్టాన్ని కాపాడాల్సిన చేతులే సామాన్యుడిపై విచక్షణారహితంగా విరుచుకుపడితే, ఇక సామాన్యుడికి దిక్కెవరు? దమ్మపేట మండలం దురదపాడులో దళితుడైన లంకా హనుమంతరావుపై ఎస్సై సాగించిన దాడి ఘటన ఇప్పుడు సభ్య సమాజాన్ని విస్మయానికి గురిచేస్తోంది. పొలం పనులకు వెళ్తున్న ఒక వ్యక్తిని ఆపి, గంజాయి, పేకాట వంటి తీవ్రమైన ఆరోపణలతో కర్రలతో బాదడం, కనీసం తనకు ఆపరేషన్ అయిందని మొరపెట్టుకున్నా కనికరించకుండా స్టేషన్‌కు తరలించడం పోలీసు వ్యవస్థలోని అమానవీయ కోణాన్ని ఎత్తిచూపుతోంది. ఒక వ్యక్తి నేరం చేశాడని తేలితే చట్టప్రకారం శిక్షించే అధికారం కోర్టులకు ఉంటుంది తప్ప, నడిరోడ్డుపై విచక్షణారహితంగా దాడి చేసే హక్కు ఏ అధికారికి లేదన్న కనీస ధర్మాన్ని ఇక్కడ విస్మరించడం గమనార్హం. కేవలం అనుమానంతోనే అక్రమ కేసులు బనాయించి, శారీరక హింసకు గురిచేయడం ప్రజాస్వామ్యమా లేక నియంతృత్వమా అని గ్రామస్థులు నిలదీస్తున్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకపోతే, ఖాకీల పై ప్రజల్లో ఉన్న నమ్మకం సడలడమే కాకుండా.. బాధితుడికి జరిగిన అన్యాయం వ్యవస్థకే మచ్చగా మిగిలిపోతుందనడంలో సందేహం లేదు.

# వెల్లివిరిసిన మానవత్వం..

- కులమతాలకు అతీతంగా సేవా కార్యక్రమాల్లో ముందుంటున్న సితలె రమేష్ అన్న

**బీర్కూర్/ఏప్రిల్15/(జన సంఘర్షణ)**



వారం క్రితం ఎండీ ఆసిఫ్ అనే యువకుడికి బీర్కూర్, తిమ్మాపూర్ మధ్యలో యాక్సిడెంట్ అయి నిజామాబాద్ ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి పరిస్థితి బాగాలేదు అని అబ్దుల్ నయీం అనే వ్యక్తి రమేష్ అన్నకి చెప్పగానే రమేష్ అన్న తన వాట్సాప్ స్టేటస్ ద్వారా 14,500 రూపాయలు జమచేసి ఈరోజు ఆసిఫ్ ఇంటికి వెళ్లి ఇచ్చి వారి కుటుంబానికి ధైర్యం చెప్పడం జరిగింది. ఇట్టి సేవా కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ అధ్యక్షులు సితలే రమేష్, గ్రామ యువకులు అబ్దుల్ నయీం,భరత్, శ్యామ్ శ్రీకాంత్, నిఖిల్, ప్రవీణ్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

# కుబీర్‌లో అరైవ్ అలైవ్ కార్యక్రమం మానవహారం

- రోడ్డు భద్రతపై అవగాహన

**కుబీర్, ఏప్రిల్ 15 (పోరు తెలంగాణ న్యూస్)**

అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా మూడవ రోజు కుబీర్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు రోడ్డు భద్రత ప్రాముఖ్యతను తెలియజేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పరస్పర చర్చ నిర్వహించి, ట్రాఫిక్ నియమాలు పాటించడం, హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగం, రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# సాంకేతిక ఉచ్చులో 'ఉపాధి'

- ఆన్‌లైన్ మస్టర్ నిబంధనలతో కూలీల పొట్ట కొడుతున్న సాఫ్ట్‌వేర్!

**కొత్తగూడెం ఏప్రిల్ 15 (జన సంఘర్షణ)**



పేదవాడి ఆకలి తీర్చాల్సిన ఉపాధి హామీ పథకం ఇప్పుడు 'ఆన్‌లైన్' నిబంధనల ఉచ్చులో చిక్కుకొని కూలీల పాలిట శాపంగా మారుతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన నూతన సాఫ్ట్‌వేర్ నిబంధనలు క్షేత్రస్థాయిలో ఆచరణకు సాధ్యం కాకపోవడంతో, జిల్లావ్యాప్తంగా వేలాది మంది కూలీలు ఉపాధికి దూరమవుతున్నారు. ముఖ్యంగా ఏదైనా గ్రామంలో 20 కంటే ఎక్కువ పనులు పెండింగ్‌లో ఉంటే కొత్త పనులకు ఆన్‌లైన్ మస్టర్ తీసుకోబోమనే నిబంధన, పాత పనుల పూర్తికి ఆటంకాలుగా మారిన నిధుల కొరత వెరసి.. కూలీలను నట్టేట ముంచుతున్నాయి. జిల్లాలో సుమారు 18,337 పనులు ప్రారంభానికి నోచుకోక, మరో 8,344 పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో "పని ఉన్నా మస్టర్ పడదు.. మస్టర్ లేక పొట్ట నిండదు" అన్నట్టుగా తయారైంది నిరుపేదల పరిస్థితి. డిజిటలైజేషన్ పేరుతో పారదర్శకతను పెంచాలనుకోవడం మంచిదే అయినా, అది సామాన్యుడి కడుపు కొట్టేలా ఉండకూడదని, క్షేత్రస్థాయి వాస్తవాలను విస్మరించి రూపొందించే ఇటువంటి సాఫ్ట్‌వేర్ నిబంధనలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయవా? అని మేధావులు ప్రశ్నిస్తున్నారు.

# రామయ్య సన్నిధిలో హుండీ కానుకల లెక్కింపు

**భద్రాచలం ఏప్రిల్ 15 (జన సంఘర్షణ)**



దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలం క్షేత్రంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి హుండీ లెక్కింపు ప్రక్రియ బుధవారం ఉదయం అత్యంత పారదర్శకంగా, భక్తి శ్రద్ధల నడుమ ప్రారంభమైంది. ఆలయ ప్రాంగణంలోని చిత్రకూట మండపంలో జరుగుతున్న ఈ లెక్కింపును దేవస్థానం ఈఓ దామోదర్ రావు స్వయంగా పర్యవేక్షిస్తుండగా, భక్తులు తమ కోర్కెలు తీరినందుకు మొక్కుబడిగా సమర్పించిన నగదు, బంగారం, వెండి కానుకలను అధికారులు క్రమబద్ధీకరిస్తున్నారు. ఇటీవలి కాలంలో భక్తుల రద్దీ గణనీయంగా పెరగడం, మరీ ముఖ్యంగా శుభకార్యాలు, పర్వదినాల నేపథ్యంలో రామయ్యకు సమర్పించిన కానుకల ద్వారా ఆదాయం రికార్డు స్థాయిలో వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అయితే, కేవలం ఆదాయం పెరగడంపైనే కాకుండా, ఆ నిధులను భక్తులకు కనీస మౌలిక వసతుల కల్పనలోనూ, ఆలయ పౌరాణిక వైభవాన్ని చాటిచెప్పే అభివృద్ధి పనుల్లోనూ ఎంతవరకు వెచ్చిస్తున్నారనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. "భక్తుడు తన కష్టార్జితాన్ని దేవుడికి సమర్పిస్తున్నప్పుడు, ఆ భక్తుడి సౌకర్యాలను చూడాల్సిన బాధ్యత కూడా యంత్రాంగంపై ఉందన్న" సత్యాన్ని ఈ లెక్కింపు ప్రక్రియ గుర్తు చేస్తోంది. కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు మధ్య సాగుతున్న ఈ లెక్కింపు ఫలితాలు సాయంత్రానికి వెలువడనున్నాయి.

# జోరుగా పోతున్న మొరం ట్రాక్టర్లు

**కోటగిరి/ ఏప్రిల్15/(జన సంఘర్షణ)**





నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రం నుంచి ఎతుండ వైపు జోరుగా మొరం ట్రాక్టర్లు ఏప్రిల్ నాడు సెలవు దినం అయితే పర్మిషన్ ఉన్నాయా లేదా తెలియదు కానీ మొరం మాత్రం ఇలా పోతున్న దృశ్యాలు ఒకరోజు ఆలస్యమైనా పాఠకుల పక్షాన ఇవ్వబోతున్న వార్త. ఇక్కడున్న కోటగిరి ఎమ్మార్వో మొరంపై దృష్టి, చూప్తలేరని కొందరు ఆయనపై విమర్శలు అయితే నిజామాబాద్ మైండ్స్ ఏడి గాని, పోలీస్ స్పెషల్ టీం మొరం తవ్వకాలుపై నిఘ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## సమస్య ఏదైనా.. పరిష్కారం కౌన్సిలర్ వంశీ!

- 3వ వార్డులో అభివృద్ధి పనుల వేగం
- ప్రజా క్షేత్రంలో కౌన్సిలర్ మార్కు రాజకీయం!
- ప్రజా సమస్యే అజెండా.. ఇల్లందు 3వ వార్డులో ముగిసిన నిరీక్షణ
- రహదారి నిర్మాణానికి శ్రీకారం!



ఇల్లందు ఏప్రిల్ 15 (జన సంఘర్షణ)

ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో ఏళ్ల తరబడి నెలకొన్న రవాణా కష్టాలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. వర్షాకాలం వస్తే చెరువులను తలపించే గుంతల రోడ్లు, స్థానికులు పడుతున్న అవస్థలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కౌన్సిలర్ అజ్మీర వంశీ, ఎమ్మెల్యే సహకారంతో ప్రత్యేక నిధులు మంజూరు చేయించి బుధవారం పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధులు అంటే కేవలం హామీలకు పరిమితం కాకుండా, సమస్య పరిష్కారం దిశగా అడుగులు వేయాలని చాటిచెప్పారు. ముఖ్యంగా అభివృద్ధి పనులంటే కేవలం శిలాఫలకాలకే పరిమితం కాకుండా, కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాల్లో ఎక్కడా రాజీ పడకూడదని, ప్రజల సొమ్ము ప్రతి పైసా వినియోగంలో పారదర్శకత ఉండాలని అధికారులను ఆదేశించడం విశేషం. కేవలం రహదారి నిర్మాణం మాత్రమే కాకుండా, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా సాగుతున్న ఈ ప్రయత్నం ఇతర వార్డులకు ఆదర్శంగా నిలుస్తోంది. త్వరితగతిన పనులు పూర్తి చేసి, ప్రజలకు సురక్షితమైన ప్రయాణ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా యంత్రాంగం కదలాలని ఆయన పిలుపునిచ్చారు.

## 'భద్రాద్రి' వైభవం మంత్రి పొంగులేటి సంకల్పం

- ఆలయ పునర్నిర్మాణ పనుల్లో వేగం, నాణ్యతే లక్ష్యం!



భద్రాచలం ఏప్రిల్ 15 (జన సంఘర్షణ)

దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలం క్షేత్ర రూపురేఖలను మార్చేలా, భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న అభివృద్ధి పనులను రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం క్షేత్రస్థాయిలో స్వయంగా పర్యవేక్షించి, పనుల పురోగతిని సమీక్షించారు. మాడవీధుల విస్తరణ, ఆలయ ప్రాకారాల పునర్నిర్మాణ పనులను నిశితంగా పరిశీలించిన మంత్రి, ఇక్కడ జరుగుతున్నది కేవలం నిర్మాణం మాత్రమే కాదని, కోట్ల మంది భక్తుల విశ్వాసాలకు ప్రతీక అని అధికారులకు గుర్తుచేశారు. అభివృద్ధి పేరిట కాలయాపనను సహించేది లేదని, భక్తులకు కనీస అసౌకర్యం కలగకుండా అంతర్జాతీయ ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని ఆయన ఇచ్చిన ఆదేశాలు ప్రభుత్వ చిత్తశుద్ధిని స్పష్టం చేస్తున్నాయి. పనులు వేగవంతం చేయడమే కాకుండా, రాబోయే వందల ఏళ్ల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నిర్మాణాల్లో అత్యున్నత నాణ్యతను పాటించాలని ఆయన నొక్కి చెప్పారు. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా భద్రాద్రిని తీర్చిదిద్దే ఈ మహాక్రతువులో అధికారులు, కాంట్రాక్టర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన పిలుపునివ్వడం, భద్రాచలం అభివృద్ధిపై ఆయనకున్న ప్రత్యేక శ్రద్ధను, దూరదృష్టిని చాటిచెబుతోంది.

## అఖిలపక్షం ఆధ్వర్యంలో నేడు ఎల్లారెడ్డి బంద్‌కు పిలుపు

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 15 (జన సంఘర్షణ)

ఎల్లారెడ్డి పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహంలో ఎనిమిదో తరగతి చదువుతున్న రాపాని శ్రావణి (13) అనే విద్యార్థిని మృతికి నిరసనగా మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేస్తున్న అఖిలపక్ష నాయకుల అరెస్టుకు నిరసనగా గురువారం ఎల్లారెడ్డి పట్టణ బందుకు పిలుపునిస్తున్నట్లు అఖిలపక్ష నాయకులు తెలిపారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థిని మృతి పట్ల అనుమానాలు ఉన్నాయని వాటిని నివృత్తి చేయడంతో పాటు విద్యార్థిని కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగం, రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తే తమకు సమాధానం ఇవ్వాల్సిన ఉన్నతాధి కారులు రాకుండా అఖిలపక్ష నాయకులను, మృతురాలి కుటుంబ సభ్యులను, బంధువులను బలవంతంగా అరెస్టు చేయడం సిగ్గుచేటు అన్నారు. ఎల్లారెడ్డి పట్టణ బందుకు వ్యాపార వాణిజ్య వర్గాలు స్వచ్ఛందంగా బంద్ పాటించి పూర్తిస్థాయిలో సహకరించాలని వారు కోరారు.

## వార్డు సభ్యుల సంక్షేమ సంఘం మండల ఉపాధ్యక్షులుగా దూస రాజశేఖర్ నియామకం



సిరిసిల్ల జిల్లా . ఏప్రిల్ 15 . (జన సంఘర్షణ )

తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల సంక్షేమ సంఘం బోయిన్ పల్లి మండల ఉపాధ్యక్షులు దూస రాజశేఖర్‌ని నియమిస్తూ కరీంనగర్ జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేసి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డు సభ్యుల సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం పనిచేయాలని తెలిపారు. తమ నియామకానికి కృషిచేసిన రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు అమ్మిగల్ల గోపాల్, రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల సాంబయ్య గౌడ్, బోయిన్ పల్లి మండల అధ్యక్షులు నాగుల రవి వర్మ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# సహకార సంఘం చిన్న రైతుల పట్ల వివక్ష

- పోతంగల్ సొసైటీ వారు చిన్న రైతుల పట్ల పక్షపాత ధోరణి అవలంబిస్తున్నారు





పోతంగల్ మండల్ /ఏప్రిల్15/(జన సంఘర్షణ)

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోని సొసైటీ వారు చిన్నా రైతుల పట్ల పక్షపాత ధోరణి అవలంబిస్తున్నారని అంతే కాకుండా కక్ష సాధింపులు చేస్తున్నారని అదేమిటని ప్రశ్నిస్తే నిర్లక్ష్య ధోరణితో సమాధానం చెబుతూ ఈసడించి రైతుల పట్ల మాట్లాడడం చాలా దారుణంగా ఉందని రైతులు అంటున్నారు. చిన్న రైతులంటే చిన్నచూపు చూడడమే కాకుండా అత్యంత దారుణంగా తమ పట్ల వ్యవహ రిస్తున్నారని ఇంత దారుణం చేయడం చాలా అవివేకమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. తమ ధాన్యం కాటా చేయడం పట్ల నిర్లక్ష్యం చేస్తున్నారని కొంతమంది పెద్ద రైతులకు వత్తాసు పలుకుతున్నారని చిన్న రైతుల పట్ల పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బార్దన్ కూడా సరిగా ఇవ్వడం లేదని ఇతర సౌకర్యాలు సరిగా కల్పించడం లేదని తమ ధాన్యం కొనుగోలు చేయడంలో చాలా నిర్లక్ష్యం చేయడమే కాకుండా వివక్ష చూపడం చాలా దారుణంగా ఉందని రైతులు అంటున్నారు. తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు పోతంగల్ సొసైటీ వారిపై చర్యలు తీసుకొని తమకు అనగా చిన్న రైతులకు న్యాయం చేయాల్సిన అవసరం ఉందని రైతులు అంటున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, సాయిలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అక్షర సైనికుల 'అవేర్ నెస్' ఆటాపాట..

- పినపాకలో రోడ్డు భద్రతపై విద్యార్థుల చైతన్య గీతం!



పినపాక ఏప్రిల్ 15 (జన సంఘర్షణ)

పినపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా విద్యార్థులు ప్రదర్శించిన సామాజిక బాధ్యత ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసింది. హెచ్ఎం రమణ సారథ్యంలో 'రోడ్డు భద్రత – జీవన రక్షణ' అనే ఇతివృత్తంతో సాగిన ఈ కార్యక్రమంలో, విద్యార్థులు కేవలం ప్రదర్శనకారులుగా కాకుండా మార్పుకు ప్రతినిధులుగా నిలిచారు. హెల్మెట్ ధరించడం ప్రాణరక్షణ కవచమని, సీట్ బెల్ట్ ప్రాముఖ్యతను మరియు ట్రాఫిక్ నిబంధనల ఆవశ్యకతను అద్భుతమైన నృత్య రూపకాలు, గుండెను హత్తుకునే నాటికల ద్వారా కళ్లకు కట్టారు. రహదారిపై జరిగే చిన్నపాటి అజాగ్రత్త ఒక కుటుంబంలో ఎలాంటి విషాదాన్ని నింపుతుందో వారు ప్రదర్శించిన తీరు స్థానికులను కదిలించింది. వేగం కన్నా ప్రాణం మిన్న అనే సందేశాన్ని కేవలం మాటలతో కాకుండా సృజనాత్మక కళారూపాలతో చాటిచెప్పిన ఈ చిన్నారుల ప్రతిభ, బాధ్యతాయుతమైన పౌర సమాజ నిర్మాణానికి అద్దం పట్టింది. ఉపాధ్యాయులు, స్థానిక ప్రజల ప్రశంసల నడుమ సాగిన ఈ కార్యక్రమం, నిబంధనలు పాటించడం భయం కోసం కాదు భద్రత కోసం అనే సత్యాన్ని మరోసారి గుర్తు చేసింది.

## సిద్ధాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో రిజర్వాయర్ పనులను పర్యవేక్షించిన పోచారం శ్రీనివాస్ రెడ్డి

వర్ని సిద్ధాపూర్/ఏప్రిల్15/(జన సంఘర్షణ)



బాన్సువాడ నియోజకవర్గం వర్ని మండలం సిద్ధాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో రిజర్వాయర్ పనులను పర్యవేక్షించిన పోచారం శ్రీనివాస్ రెడ్డి. ఈ సందర్భంగా అధికారులను రిజర్వాయర్ పనులను గురించి ఆరా తీసి వర్షాలు వచ్చేటప్పటికి మొదటి రిజర్వాయర్ పనులను పూర్తి చెయ్యాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సురేష్ బాబా డీసీసీ సెక్రటరీ వెలగపూడి గోపాల్, కల్లాల్ గిరి అబ్దుల్ భారీ ఎంఆర్వో సాయిలు, సర్పంచ్ కేంద్రం సాయిలు సర్పంచ్ మద్దిపూడి శ్రీను రైతులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం రాజకీయ యవనికపై 'జావేద్' ముద్ర చెరిగిపోనిది

- రోడ్డు ప్రమాదంలో అంకితభావం కలిగిన నేత దుర్మరణం..
- మంత్రి పొంగులేటి ప్రగాఢ సంతాపం!



ఖమ్మం ఏప్రిల్ 15 (జన సంఘర్షణ)

ఖమ్మం నగర రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేక ఒరవడిని సృష్టించుకున్న సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ జావేద్, సూర్యాపేట జిల్లా మోతే వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందడం ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో తీరని శూన్యాన్ని మిగిల్చింది. పార్టీకి కష్టకాలంలో అండగా ఉండి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడిగా శ్రేణులను ఏకోన్ముఖం చేసిన ఆయన ప్రస్థానం నేటి తరం రాజకీయ నాయకులకు ఒక పాఠం. జావేద్ మరణ వార్త వినగానే తీవ్ర దిగ్భ్రాంతికి లోనైన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, "ఒక నిబద్ధత కలిగిన యోధుడిని కోల్పోయాం" అంటూ ఆవేదన వ్యక్తం చేయడం ఆయన వ్యక్తిత్వాన్ని చాటిచెబుతోంది. ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా సాగిన ఆయన ప్రయాణం ఇలా అర్ధాంతరంగా, రక్తసిక్తమైన రహదారిపై ముగిసిపోవడం కేవలం ఒక పార్టీకే కాక, సామాన్య ప్రజానీకానికి కూడా పెద్ద నష్టమే. "మృత్యువు ఏ రూపంలో పొంచి ఉంటుందో తెలియదు కానీ, ప్రజా సేవలో పునరాంకితమైన ప్రాణం ఇలా గాలిలో కలిసిపోవడం విధి ఆడిన వింత నాటకమా?" అని ఆలోచింపజేసేలా ఉన్న ఈ ఘటన జిల్లావ్యాప్తంగా విషాద ఛాయలు నింపింది. జావేద్ ఆత్మకు శాంతి కలగాలని అల్లాను ప్రార్థిస్తూ, ఆయన కుటుంబానికి ఈ పుట్టెడు దుఃఖాన్ని తట్టుకునే ధైర్యం కలగాలని ఆకాంక్షిద్దాం.

# 'అరైవ్ అలైవ్' వారోత్సవాల్లో భాగంగా మానవహారం

- రోడ్డు భద్రతపై విద్యార్థుల్లో అవగాహన కల్పించిన బాసర సీఐ కిరణ్ కుమార్




బాసర, ఏప్రిల్ 15 జన సంఘర్షణ)

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న 'అరైవ్ అలైవ్' వారోత్సవాలు జిల్లాలో విజయవంతంగా కొనసాగుతున్నాయి. చిల్డ్రన్ రోడ్ సేఫ్టీ డే పురస్కరించుకుని బుధవారం ఉదయం బాసరలోని నాగభూషణ పాఠశాలలో బాసర సీఐ కిరణ్ తన సిబ్బందితో కలిసి విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల సమీపంలోని చౌరస్తా వద్ద పాఠశాల విద్యార్థులచే మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ కిరణ్ నాగభూషణ పాఠశాల ప్రిన్సిపల్ జే. బాబూరావుతో కలిసి విద్యార్థులకు ట్రాఫిక్ పై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నియమాలపై విద్యార్థుల్లో చైతన్యం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందించుకోవడం ఎంతో అవసరమని తెలిపారు. ట్రాఫిక్ సిగ్నల్ గురించి, సిగ్నల్ వద్ద ట్రాఫిక్ ఐలాండ్, జీబ్రా క్రాసింగ్ వద్ద వాహనాలు ఆగినప్పుడు వైట్ బ్లాక్ లైన్ వద్ద రోడ్డు క్రాస్ చేయడం వంటి అంశాలను విద్యార్థులకు వివరించారు. టి జంక్షన్, ఎక్స్ రోడ్ వద్ద నియమాలు పాటించాలని సూచించారు. విద్యార్థులే రోడ్డు భద్రతకు బ్రాండ్ అంబాసిడర్లు అని, పిల్లలు చెప్పే మంచి విషయాలను ప్రతి ఒక్కరూ గౌరవంగా స్వీకరిస్తారని అన్నారు. కుటుంబ సభ్యులు వాహనాల్లో ప్రయాణించే సమయంలో హెల్మెట్ వినియోగం, సీట్ బెల్ట్ ధరించడం, మద్యం సేవించి వాహనం నడపకూడదనే అంశాలు, అతివేగం ప్రమాదాలు వంటి విషయాలపై అవగాహన కల్పించారు. పాఠశాల ప్రిన్సిపల్ బాబురావు మాట్లాడుతూ .. రోడ్డు భద్రత పై విద్యార్థులకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని, తల్లిదండ్రులకు కూడా ఈ విషయాలపై చైతన్య పరచాలని చెప్పారు. కార్యక్రమం ముగింపులో సీఐ, పాఠశాల ప్రిన్సిపల్ లు విద్యార్థులతో కలిసి రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ సుమేర, దీపిక, చారి, సుభాష్ పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్నెళ్లలో అందుబాటులోకి నేలటూరు ఫిషింగ్ జెట్టీ: ఎంపీ వేమిరెడ్డి

- **జెట్టీ పనుల పరిశీలనలో పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి**
- **పనులు పూర్తి చేసి మళ్లీ ప్రారంభోత్సవానికి వస్తామన్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి**
- **పనులు పూర్తి చేయడంలో ఉన్న సమస్యలు, పరిష్కారంపై సంబంధిత అధికారులతో చర్చ**

నెల్లూరు జిల్లా- (జన సంఘర్షణ): రాబోయే ఆరు నెలల్లో నేలటూరు ఫిషింగ్ జెట్టీ పనులను పూర్తి చేస్తామని రాష్ట్ర ఆర్ అండ్ బి శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి తెలిపారు. సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నేలటూరు జెట్టీని సందర్శించిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య తదితరులు. ఈ సందర్భంగా పనుల పెండింగ్‌పై కృష్ణపట్నం పోర్టు అధికారులతో వారు ప్రత్యేకంగా చర్చించారు. కృష్ణపట్నం పోర్టును, ప్రత్యేక బోటులో సముద్రంలోకి వెళ్లి పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం నేలటూరు వద్ద అసంపూర్తిగా ఉన్న ఫిషింగ్ జెట్టీ నిర్మాణ పనులను పరిశీలించి స్థానిక మత్స్యకారులతో చర్చించి చేపట్టాల్సిన పనులపై సవివరంగా మాట్లాడారు. రూ.17 కోట్లతో అదానీ కృష్ణపట్నం పోర్టు ఆధ్వర్యంలో పనులు చేసిన విషయంతో పాటు పెండింగ్ పనులు అత్యంత త్వరగా పూర్తి చేయడం, మత్స్యకారులు రెండో జెట్టీని కోరుతున్న అంశాన్ని మంత్రి, మారిటైం బోర్డు చైర్మన్ దృష్టికి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తీసుకెళ్లారు. నేలటూరు ఫిషింగ్ జెట్టీని పూర్తి చేయాలని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాపై ఒత్తిడి తెస్తున్నారని, మత్స్యకారులకు ఇచ్చిన హామీ నెరవేర్చాలని ఆయన చాలా పట్టుదలతో ప్రయత్నిస్తున్నారని చెప్పారు. రూ.12 కోట్ల అంచనాతో తయారు చేసిన డీపీఆర్ ప్రకారం ప్రతి పని పూర్తి చేస్తామని, ఆర్నెళ్లలో మత్స్యకారులకు జెట్టీని అందుబాటులోకి తెస్తామన్నారు. మత్స్యకారుల వినతి మేరకు రెండో జెట్టీ నిర్మాణంపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇప్పుడే అధికారులకు సూచించామన్నారు. స్థానికంగా మత్స్యకారులు జెట్టీలో మౌలిక సదుపాయాల కల్పనపై తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రి కృష్ణపట్నం పోర్టు ద్వారా ఇప్పటికే జెట్టీ నిర్మాణం, కనెక్టివిటీ రోడ్డు, బ్రేక్ వాటర్స్ నిర్మాణం పూర్తి చేశామన్నారు. డ్రెడ్జింగ్ అంశంలో రాష్ట్రంతో పాటు కేంద్ర ప్రభుత్వ అనుమతులు కూడా తీసుకోవాల్సి ఉందని స్పష్టం చేశారు. కొత్తగా వచ్చిన ప్రతిపాదనలకు సంబంధించి అధికారులు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తారని, అదే సమయంలో ప్రభుత్వం దృష్టికి వాటిని తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. మత్స్యకారుల సూచనలన్నీ పరిగణనలోకి తీసుకుంటున్నామని వివరించారు. అనంతరం నేలటూరుపాలెం గ్రామంలో రూ. 30.39 లక్షలతో నూతనంగా నిర్మించిన అంతర్గత సిమెంట్ రోడ్లను మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ప్రారంభించారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వంలో పల్లె సీమలు అభివృద్ధికి చిరునామాగా నిలుస్తున్నాయన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతూ ప్రజల ఇబ్బందులు తొలగిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్ చార్జి బొబ్బేపల్లి సురేష్ నాయుడు, మత్స్యకార నాయకులు, కూటమి పార్టీల నేతలు పాల్గొన్నారు.





# టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేష్

- **పొలిట్ బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీలను ప్రకటించిన తెలుగుదేశం పార్టీ.**
- **పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మంత్రి నారా లోకేష్.**
- **టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాస్.**
- **సీనియర్లకు గౌరవం. కొత్తవారికి అవకాశాలు.**
- **సామాజిక కోణం కోణంలో నూతన కమిటీల కూర్పు.**
- **విధేయత, కష్టపడే తత్వం, అనుభవం లెక్కించి పదవులు ఇచ్చిన అధిష్టానం.**
- **నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు రాని వారికి పార్టీ పదవుల ద్వారా న్యాయం.**
- **పొలిట్ బ్యూరోలో అనూహ్య మార్పులు, ప్రతి కమిటీలోను నూతనత్వం.**
- **29 మందితో పొలిట్ బ్యూరో, 31 మందితో జాతీయ కమిటీ, 185 మందితో రాష్ట్ర కమిటీ కూర్పు.**

కుప్పం,ఏప్రిల్ 15 (జన సంఘర్షణ): తెలుగు దేశం పార్టీ పొలిట్ బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీలను ఆ పార్టీ ప్రకటించింది. పార్టీకి విధేయత కష్టపడే తత్వం అనుభవాన్ని లెక్కలోకి తీసుకుని పదవులను కట్టబెట్టారు. పనిచేసే వారికి పార్టీలో పెద్దపీటన్న సంగీతాన్ని ఇచ్చింది పార్టీ. కార్యకర్త పార్టీకి అధినేత అన్న వినూతన ఆలోచనలతో పార్టీని తిరుగులేని సైన్యంగా తీర్చిదిద్దారు. పార్టీ కార్యవర్గ వివరాలను ఆ పార్టీ అధిష్టానం ప్రకటించింది.జాతీయ ప్రధాన కార్యదర్శులు-3, జాతీయ ఉపాధ్యక్షులు-18, జాతీయ అధికార ప్రతినిధులు-10 మంది నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షులుగా పల్లా శ్రీనివాసరావును నియమించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు-7, రాష్ట్ర ఉపాధ్యక్షులు-16, రాష్ట్ర అధికార ప్రతినిధులు-14, రాష్ట్ర జోనల్ కో-ఆర్డినేటర్ల-10, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు-59, రాష్ట్ర కార్యదర్శులు-77మంది నియమితులయ్యారు. నాలెడ్జి కమిటీ, హెచ్‌ఆర్డీ కమిటీల్లో ఒక్కొరి చొప్పున నియామకం జరిగింది. అన్ని సమీకరణాలు బేరీజు వేసుకుని కమిటీల కూర్పుపై కసరత్తు చేసిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు. గతానికి భిన్నంగా పార్టీ కమిటీల కూర్పును కొత్త పుంతలు తొక్కించిన విషయం తెలిసిందే. గత కొంత కాలంగా చెబుతున్నట్టే పార్టీ బలోపేతానికి కష్టపడిన వారికి, విధేయులకు పెద్ద పీట వేశారు. ఓ మండల పార్టీ అధ్యక్షురాలికి, ఓ క్లస్టర్ ఇన్చార్జికి నేరుగా పొలిట్ బ్యూరోలో చోటు కల్పిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. పార్టీ అత్యున్నత స్థాయి కమిటీ పొలిట్ బ్యూరోలో చోటు దక్కించుకున్న గజపతినగరం మండల పార్టీ అధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి, మంగళగిరి క్లస్టర్ ఇన్చార్జ్ గుత్తికొండ ధనుంజయ్. రాష్ట్ర కమిటీలోని 185 మందికి గానూ 50 మంది మహిళలకు చోటు, పొలిట్ బ్యూరో, జాతీయ కమిటీల్లోనూ మహిళలకు సముచిత స్థానం కల్పించారు. జనాభా దామాషా పద్దతిన, సామాజిక, ప్రాంతీయ సమీకరణాలు బేరీజు వేసుకుని కమిటీల కూర్పు.185 మంది రాష్ట్ర కమిటీ సభ్యుల్లో 122 మంది బడుగులకు స్థానం కల్పించిన టీడీపీ అధిష్టానం.బీసీ-77, ఎస్సీ-25, ఎస్టీ-7, మైనార్టీ-13 మందికి రాష్ట్ర కమిటీలో చోటు కల్పించిన చంద్రబాబు. బీసీలకు 40 శాతం, ఎస్సీలకు 25 శాతం, ఎస్టీలకు 3.8 శాతం, మైనార్టీలకు 7 శాంత చొప్పున కమిటీలో స్థానం కల్పించిన టీడీపీ అధినాయకత్వం.2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అన్ని కోణాల్లో విశ్లేషించి కమిటీల కూర్పు చేపట్టిన చంద్రబాబు. పార్టీకి యువ నాయకత్వం అందుబాటులోకి వచ్చేలా నియామకాలు.నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణ, 33 శాతం మహిళా రిజర్వేషన్లను దృష్టిలో పెట్టుకుని కసరత్తు చేసిన చంద్రబాబు. గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళలకు పెద్ద పీట వేస్తూ కమిటీల కూర్పు చేపట్టారు.



# ఘనంగా దివంగత బొజ్జల గోపాలకృష్ణా రెడ్డి 78వ జయంతి వేడుకలో నెమళ్లూరు బుజ్జి

శ్రీకాళహస్తి ఏప్రిల్ 15 (జన సంఘర్షణ): శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆదేశాలతో పట్టణంలోని స్థానిక ఎన్టీఆర్ నగర్ కూడలి బుధవారం మాజీ మంత్రి స్వర్గీయ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి 78 వ జయంతిని నెమళ్లూరు బుజ్జి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నెమళ్లూరు బుజ్జి మాట్లాడుతూ.. దివంగత గోపాల్ అన్న శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపారని అందులో కొన్ని స్కిట్ కళాశాల తీసుకురావడం, 100 పడకల ఆసుపత్రిని నిర్మించడం, ప్రతి గ్రామానికి మంచినీటి ట్యాంకులు నిర్మించడం, ప్రతి గ్రామానికి సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేయడం, ప్రతి చెరువుకు పూడిక తీయించడం, గ్రామ గ్రామానికి విద్యుత్తు లైట్లు ఏర్పాటు చేయడం, శాంతిభద్రతలు అదుపులో ఉంచడం, శివం టు శివం రోడ్డు ను ప్రారంభించడం, టిడ్కో గృహ సముదాయానికి శంకుస్థాపన చేయడం ఇలాంటివి చెప్పుకుంటూ పోతే మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలను గోపాల్ కృష్ణారెడ్డి ముందుండి నడిపించారన్నారు. భౌతికంగా గోపాలన్న మన ముందు లేకపోయినా మన అందరి హృదయాలలో స్థిరస్థాయిగా ఎల్లప్పటికీ ఉండిపోతారని నెమళ్లూరు బుజ్జి తెలిపారు. అలాగే వారి వారసులు ప్రస్తుత ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి కూడా తండ్రికి తగ్గ తనయులుగా వారి అడుగుజాడల్లో నడుస్తూ వారు ప్రారంభించిన స్కిట్ కళాశాలను పునరుద్ధరించడం, తరచు జాబ్ మేళా ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, అలాగే టిడ్కో గృహ సముదాయాలను లబ్ధిదారులకు ఈరోజు అందించారు. శివం టు శివం రోడ్డును కూడా త్వరలో అందుబాటులోకి తీసుకురాబోతున్నారు. ఇలా తండ్రి ఆశయాలను నెరవేర్చే కుమారుడుగా అభివృద్ధి బాటలో దూసుకుపోతున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు నెమళ్లూరు బుజ్జి, పూల శేఖర్, శివకుమార్, బాలయ్య, ఆకుల గురుమూర్తి, ఆకుల సునీత, నున్న అనూష, మహమ్మద్, తేజ, సులేమాన్, కోట చారి, హరి, శివ, మహమ్మద్ రఫీ, నాగమ్మ, నాగరాజు, సుబ్రహ్మణ్యం, వంశీకృష్ణ, బేగ్, కన్నయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




## నిజామాబాద్ అక్రమంగా ఇసుక మాఫియాపైన సీసీఎస్ టీం మెరుపు దాడి

నిజామాబాద్ వేల్పూర్/ఏప్రిల్15/(జన సంఘర్షణ)



నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ఆదేశాల మేరకు సీసీఎస్ ఏసీబీ మస్తాన్ వలీ ఆధ్వర్యంలో సీసీఎస్ సిబ్బంది వేల్పూర్పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్టు, సమాచారం అందుకున్నారు. వెంటనే సంప్రదించి 14 టైర్ల వాహనం, 2సెల్ ఫోన్లు, 2,2 డ్రైవర్లను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం వారిని వేల్పూర్ పోలీస్ స్టేషన్నూనుకీ. అప్పగించారు.ఇకపై ఎక్కడైనా అక్రమంగా ఇసుక ఏ బి లేకుండా జరుగుతే, మా పోలీస్ సిబ్బందికి ఫోన్ చేయండి అని సిపి సాయి చైతన్య చెప్పడం జరిగింది.

## బోధన్ పట్టణంలో రాత్రిపూట కలప ఇలా తగులుతుంది



బోధన్/ఏప్రిల్15/(జన సంఘర్షణ) బోధన్ పట్టణంలో అర్ధరాత్రి లేక ఇతర టైంలలో రాత్రిపూట కలప అక్రమంగా తల్లుతుందని అదేవిధంగా ఇసుక కూడా తల్లుతుందని పట్టించుకునే నాధులు కరువు అయ్యారని విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. సంబంధించిన అధికారులు నిర్లక్ష్యమే అక్రమంగా కల్ప పాల్పడుతున్న దొంగలముఠా వీటిపై ఉన్నది అధికారులు దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## అరైవ్ అలైవ్'లో భాగంగా రోడ్డుపై విద్యార్థుల మానవహారం..

కోటగిరి/ ఏప్రిల్15/ (జన సంఘర్షణ)






కోటగిరిలోని బస్టాండ్ ఆవరణలో విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. మైనర్, రాంగ్ రూట్ డ్రైవింగ్, డ్రంకన్ డ్రైవ్ వంటి వాటి వల్ల సంభవించే ప్రమాదాలను గురించి వివరిస్తూ మానవహారం ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో విద్యార్థులకు రోడ్డు భద్రత, నియమాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మైనర్, రాంగ్ రూట్ డ్రైవింగ్, డ్రంకన్ డ్రైవ్ వంటి వాటి వల్ల సంభవించే ప్రమాదాలను గురించి వివరిస్తూ మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో యశశ్ర ఈ స్కూల్ బృందావనం పిల్లలు ప్రధానోపాధ్యాయులు అనిల్ సార్, కోటగిరి పోలీస్ సిబ్బంది, ఎస్సై సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు మూడు పూటలా నాణ్యమైన ఆహారం

కుప్పం, ఏప్రిల్ 15 (జన సంఘర్షణ): పేదలకు మూడు పూటలా నాణ్యమైన ఆహారం అందించే లక్ష్యంతోనే అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు. కుప్పం నియోజకవర్గం గుడిపల్లి మండల కేంద్రంలో కొత్త అన్నా క్యాంటీన్‌ను తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఆర్ చంద్రశేఖర్ టిడిపి మండల పార్టీ అధ్యక్షులు సుబ్రమణి, ప్రధాన నాయకులు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లు ప్రత్యేకత శ్రద్ధతో అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కేవలం ఐదు రూపాయలతో రుచికరమైన నాణ్యమైన ఆహారం అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాజు, హేమాంబర గౌడు,బేటప్ప నాయుడు,ఎల్లప్ప, ప్రధాన నాయకులు క్లస్టర్ ఇంచార్జిలు, కో క్లస్టర్ ఇంచార్జీలు, బూత్ ఇంచార్జిలు, నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# హసనపర్తిలో వరంగల్ డిసిసిబి నూతన శాఖ త్వరలో ప్రారంభం




**హనుమకొండ :**
వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు హసనపర్తి నూతన శాఖ, హసనపర్తి లోని PACS హసన పర్తి భవనములో త్వరలో ప్రారంభం కానుంది. ఈ నూతన శాఖ ప్రారంభం తో హసనపర్తి మండలం తో పాటు సమీప గ్రామాల ప్రజలకు బ్యాంకింగ్ సేవలు మరింత చేరువ అవుతాయి. ఇప్పటివరకు బ్యాంకింగ్ అవసరాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండగా, ఇకపై స్థానికంగానే సేవలు పొందే వీలుంటుంది. ప్రత్యేకంగా రైతులకు పంట రుణాలు, పశుసంవర్ధక రుణాలు, స్వయం ఉపాధి రుణాలు అందుబాటులోకి రావడం వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని అధికారులు భావిస్తున్నారు. అదనంగా సేవింగ్స్ ఖాతాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, డిజిటల్ బ్యాంకింగ్ వంటి సేవలు కూడా అందించనున్నారు. సభ్యులు మరియు ఖాతాదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని బ్యాంకు అధికారులు సూచించారు. స్థానిక సహకార సంఘాలతో కలిసి పనిచేయడం ద్వారా ఈ శాఖ గ్రామీణాభివృద్ధికి దోహదపడనుంది. మొత్తానికి, ఈ శాఖ ప్రారంభం హసనపర్తి ప్రాంతానికి ఆర్థిక పరంగా కొత్త ఊపుని తీసుకురానుందని బ్యాంకు అధికారులు ఆశిస్తున్నారు.

# పెరుగురాజన్నకుంట ఆక్రమణలపై తక్షణ చర్యలు కోరుతూ వినతి



**కోహెడ :**
కోహెడ మండలంలోని తీగ లకుంటపల్లి గ్రామ పరిధిలో ఉన్న పెరుగురాజన్నకుంట ఆ క్రమణలపై తక్షణ చర్యలు తీసు కోవాలని కోరుతూ గ్రా మానికి చెందిన రాగుల సతీష్ తహశీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. వినతి పత్రంలో ఆయన పేర్కొన్న వివరాల ప్రకారం, సర్వే నెం. 369లో సుమారు 29 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ చెరువు ప్రస్తుతం ఆక్రమణల కార ణంగా దాదాపు 9 ఎకరాలకు కుదించుకుపోయిందని తెలిపారు. కొంతమంది వ్యక్తులు చెరువు భూమిని ఆక్రమించి వ్యవసాయం చేస్తున్నారని ఆరోపించారు. గతంలో రెవెన్యూ అధికారులు పంచనామా నిర్వహించి హద్దులు నిర్ణయించి ఆక్రమణదారులను గుర్తిం చినప్పటికీ, ఇప్పటివరకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ఇందులో భాగంగా గ్రామానికి చెందిన పెరుగు సురేందర్ రెడ్డి సుమారు 10 ఎకరాల చెరువు భూమిని ఆక్రమించి చేపల చెరువులు, మామిడి తోటలు ఏర్పాటు చేసుకున్నట్లు ఆరో పించారు. అలాగే సర్వే నెం. 400/9లో ఆయన తండ్రి పెరుగు గాల్ రెడ్డి 3 ఎకరాలు 20 గుంటల భూమి తోటపల్లి రిజర్వాయర్ కాలువలో భాగంగా వెళ్లిపోవడంతో ప్రభుత్వం నుంచి రూ.7,35,000 పరిహారం పొందినప్పటికీ, అదే భూమిని తిరిగి ఆన్లైన్‌లో నమోదు చేసి గత పదేళ్లుగా రైతుబంధు సాయం పొందుతున్నారని వినతిపత్రంలో వెల్లడించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వాన్ని మోసం చేసిన వారిపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి, రైతుబంధు కింద పొందిన మొత్తాన్ని తిరిగి వసూలు చేయాలని కోరారు. అదేవిధంగా ఆక్ర మణకు గురైన పెరుగురాజన్నకుంటకు వెంటనే హద్దులు నిర్ణయించి, చెరువును రక్షిం చేందుకు చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌ను విజ్ఞప్తి చేశారు.

# శ్రీకోదండ రామచంద్రస్వామి దేవాలయ నూతన అధ్యక్షుడిగా ఎం.రంజిత్ రెడ్డి

**ఉప్పల్ :**



హబ్సిగూడ ఎస్.ఎస్.నగర్‌లోని శ్రీ కోదండ రామచంద్ర స్వామి నిర్మాణ నిర్వహణ సంఘం సర్వసభ్య సమా వేశం బుధవారం దేవాలయ ప్రాంగ ణంలో నిర్వహించారు. సమా వేశంలో సభ్యులు ఏకగ్రీవంగా రెం డేళ్ల కాలానికి నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన చైర్మన్‌గా ఏ.యాదవ రెడ్డి, అధ్య క్షుడిగా ఎం. రంజిత్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా కె.వి. రాజి రెడ్డి, ఆర్. సిరీష్ రెడ్డి, జనరల్ సెక్రటరీగా జి. సుధాకర్ రెడ్డి, కోశాధికారిగా బి.కె. స్వామి ఎన్నికయ్యారు. జాయింట్ సెక్రటరీలుగా జి. రవీందర్ రెడ్డి,టి.రాఘవేందర్ రెడ్డి, ఆర్గనైజర్ సెక్రటరీలుగా జి. భాను సత్య శివరామ్ ఎన్నికయ్యారు. ఈసీ సభ్యులుగా జె. వెంకటేశ్వర రెడ్డి, కె. అశోక్ రెడ్డి, కె. దామోదర్ రెడ్డి, ఎం. అరవింద్ రెడ్డి, సంజయ్ సేథియా,టి.ధర్మ రెడ్డి,బి. శ్రీనివాస్, జి.సత్యనారాయణ రెడ్డి,సిహెచ్. మహేందర్ రెడ్డి, టి.ఇందర్ సింగ్,సి.నిరంజన్ రెడ్డి, బి. రామి రెడ్డి ఎన్నికయ్యారు. సలహాదారులుగా కె. మల్ల రెడ్డి, బి. సుధాకర్ రెడ్డి, ఎం. సుధాకర్ రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా దేవాలయ నూతన అధ్యక్షుడు ఎం. రంజిత్ రెడ్డి మాట్లాడుతూ సభ్యులందరూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

# ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సత్కారం

**-సమగ్ర అభివృద్ధికి కార్యక్రమాలు అవసరం**

**- పాఠశాల కరస్పాండెంట్ ఎం. వెంకటయ్య**



**జహీరాబాద్**
ప్రఖ్యాత విద్యాసంస్థ అయిన శ్రీ మాణిక్ ప్రభు హై స్కూల్‌లో 2025--26 విద్యాసంవత్సరానికి సంబంధించిన బెస్ట్ ఆక్టివిటీస్ అచీవ్‌మెంట్ సెరెమనీ ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో సంవత్సరం పొడవునా నిర్వహించిన విద్యా, సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. ఉత్తమ ప్రదర్శన చేసిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేసి అభినందించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఎం. వెంకటయ్య మాట్లాడుతూ... విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని తెలిపారు. చదువుతో పాటు సహపాఠ్య కార్యక్రమాల్లో రాణించడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు.

# నాణ్యత విశ్వాసం సేవలతో వినియోగదారుల గుండెల్లో నాగార్జున డెయిరీ ప్రత్యేక స్థానం

**ఒకేరోజు 3నూతన పార్లర్లను ప్రారంభించిన సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పుల్లూరు ప్రభాకర్ రావు**









**కరీంనగర్ :**
కరీంనగర్ పట్టణం మరో అభివృద్ధి మైలురాయిని సాక్ష్యంగా నిలిచింది. ప్రముఖ పాల సంస్థ నాగార్జున డెయిరీ ఆధ్వర్యంలో కిసాన్ నగర్,రేకుర్తి, కమాన్ ప్రాం తాల్లో ఒకేరోజు మూడు నూతన పార్లర్లను అత్యంత వైభ వంగా ప్రారంభించారు. ఈ విశిష్ట కార్యక్రమానికి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పుల్లూరి ప్రభాకర్ రావు,సీఈవో కృష్ణ ప్రసాద్ ప్రధాన అతిథులుగా హాజరై రిబ్బన్ కట్ చేసి పార్లర్లను ప్రారంభించారు. కరీంనగర్ డివిజన్ సేల్స్ మేనేజర్ నోముల పరశురామ్ గౌడ్,స్థానిక ప్రజాప్రతి నిధులు,కార్పొరేటర్లు, వ్యాపారవేత్తలు,పెద్ద సంఖ్యలో వినియోగదారులు ఈ కార్యక్రమంలో పాల్గొని వేడుకను మరింత శోభాయమానం చేశారు. ఇరవై సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణంలో నాగార్జున డెయిరీ నాణ్యత, విశ్వాసం,సేవలతో వినియోగదారుల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. గ్రామీణ రైతులకు బలమైన ఆధారం,పట్టణ వినియోగదారులకు విశ్వసనీయ బ్రాండ్ గా ఎదిగిన ఈ సంస్థ,ఇప్పుడు మరింత విస్తరణ దిశగా ముందుకు సాగుతోంది. ఈ మూడు నూతన పార్లర్ల ప్రారంభంతో కరీంనగర్ ప్రజలకు తాజా,నాణ్యమైన పాల ఉత్పత్తులు మరింత సులభంగా అందుబాటులోకి రానున్నాయి. భవిష్యత్తులో మరిన్ని విస్తరణలు చేపట్టి, సేవల పరిధిని విస్తరించాలనే సంకల్పాన్ని సంస్థ ప్రతిని ధులు వెల్లడించారు. వినియోగదారుల నమ్మకానికి, నాణ్యతకు మారుపేరుగా నాగార్జున డెయిరీ పాలు,పాల ఉత్పత్తులు,రైస్ నిలుస్తున్నాయని,అందరికీ అందుబా టులో ఉండే విధంగా పార్లలను ప్రారంభిస్తున్నట్లు నాగా ర్జున డెయిరీ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పుల్లూరు ప్రభా కర్ రావు తెలిపారు. నాగార్జున డెయిరీ కరీంనగర్ ఏరి యా మార్కెటింగ్ ప్రతినిధులు అనిల్,శేఖర్,వంశీ జగన్, తదితరులు పాల్గొన్నారు.

# డీ లిమిటేషన్ తో దక్షిణాదికి అన్యాయం

**-కేంద్ర ప్రభుత్వ యత్నాలను సహించబోము**

**-టిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని చేపడతాం**

**-బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**








**పీర్జాదిగూడ:**
దక్షిణాది రాష్ట్రాలపై డీలిమిటేషన్ పేరుతో అన్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. అలాంటి ప్రయత్నాలను బీఆర్ఎస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని స్పష్టం చేశారు. అవసరమైతే కేసీఆర్ నాయకత్వంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడలో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పార్టీ చేరికల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బీఆర్ఎస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, క్యామ మల్లేష్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి చెం దిన మాజీ కార్పొరేటర్ కౌడే పోచయ్య, విద్యావేత్త ఆకుల మధుకర్, వెల్లంకి శశిధర్ రెడ్డి, దొంతిరి మధుసూదన్ రెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డి, ఒంటెరు మాధవ రెడ్డి, సోమిరెడ్డి తో పాటు ఇతర పార్టీలకు చెందిన పలువురు నాయకులను బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడు తూ...మహిళలకు స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన పార్టీ బీఆర్ఎస్ అని గుర్తుచేసిన కేటీఆర్, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు కాలేదని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు ఇప్పటికీ నెరవేర్చలేదని అన్నారు. హైదరాబాద్‌లో భూకబ్జాలు పెరిగిపోయాయని, ప్రజల కు భద్రత లేకుండా పోయిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలపై దృష్టి పెట్టడం లేదని మండిపడ్డారు. ఉప్పల్ ఫ్లైఓవర్ పనులు సంవత్సరాలుగా సాగుతూనే ఉన్నాయని, కేంద్రం-రాష్ట్రాల మధ్య సమన్వయం లోపంతో అభివృద్ధి నిలిచిపోయిందని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో మళ్లీ బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని విశ్వా సం వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేసి అభివృద్ధికి మద్దతు ఇవ్వాలని ప్రజలకు పిలు పునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్య దర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్,దొంతిరి హరిశంకర్ రెడ్డి,మధుసూదన్ రెడ్డి, లేతాకుల మాధవి రఘుపతి రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నిర్మల, యూత్ అధ్యక్షులు ప్రభు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి,మైనారిటి అధ్యక్షులు జిలాని పాష, జావీద్ ఖాన్, మాజీ మేయర్లు సామల బుచ్చిరెడ్డి, మేకల కావ్య, పోచారం మాజీ చైర్మన్ కొండల్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ రెడ్యానాయక్, బోడుప్పల్ అధ్యక్షులు మంద సంజీవ రెడ్డి, సీనియర్ నాయకులు కొత్త రవి గౌడ్, మీసాల కృష్ణ, కొండల్ రెడ్డి, శేఖర్, మాధవ్ రెడ్డి, సురేందర్ రెడ్డి, రమేష్, పీర్జాది గూడ, బోడుప్పల్, పోచారం, ఘట్కేసర్ నాయకులు మహిళలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత నియమాలను పాటించండి

**ప్రమాద రహితంగా జీవించండి**

**మండల అభివృద్ధి అధికారి**



**అన్నపురెడ్డిపల్లి :**
ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్య క్రమం లో భాగంగా ది బుధవారం ఎర్రగుంట ప్రధాన కూడలిలో మనవహారం, రోడ్డు భద్రత ప్రతిజ్ఞ, నిర్వహిం చడం జరిగింది. మండల విద్యాశాధికారి ఉండేటి ఆనం ద కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మం డల అభివృద్ధి అధికారి కావూరి మహాలక్ష్మి, సబ్ ఇన్స్పె క్టర్ విజయ సింహ రెడ్డి, పెద్దిరెడ్డిగూడెం గ్రామ సర్పంచ్ సున్నం నాగభూషణం అతిధిలుగా పాల్గొన్నారు. ఎర్ర గుంట ఉన్నత పాఠశాలలో వ్యాసరచన, వక్తృత్వ, లేఖ రచన పోటీలను నిరాహించారు. ప్రథమ, ద్వితీయ బహుమతులను సబ్ ఇన్స్పెక్టర్ ప్రధానం చేశారు. ఎర్ర గుంట ప్రధాన కూడలి లో విద్యార్థులు, మండల స్థాయి అధికారులు , ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు, ఉపా ధ్యాయులు, విద్యార్థులు మానవ హారం నిర్వహించారు. మండల అభివృద్ధి అధికారి మహాలక్ష్మి మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు పిల్లలకు వాహనాలను నడపడానికి అనుమతించ వద్దని తెలియజేశారు. సబ్ ఇన్స్పెక్టర్ విజయసింహ రెడ్డి రోడ్డు భద్రత నియమాలను వివరిం చారు. అనంతరం మండల విద్యాశాఖాధికారి కూడాలి వద్ద సమావేశామైన అందరితో రోడ్డు భద్రత ప్రతజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మండల అధికా రులు, అన్నపురెడ్డిపల్లి రెవెన్యూ ఇన్స్పెక్టర్, గ్రామ కార్య దర్శి, గ్రామ పెద్దలు వేముల రమణ, బసవయ్య, ఎర్ర గుంట వైద్య సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది, ఎర్రగుంట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు, ప్రయాణ దారులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జారె

**కొత్తగూడెం :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న “అరైవ్ అలైవ్” కార్యక్రమంలో పాల్గొన్నారు ముందుగా దమ్మపేట మండలం నల్లకుంట గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వాహనదారులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. అనంతరం అశ్వారావుపేట మండల కేంద్రంలోని శ్రీశ్రీ ఫంక్షన్ హాల్ నందు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రజలకు రోడ్డు ప్రమాదాల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు... ఈ కార్యక్రమంలో పాల్వంచ డి.ఎస్.పి సతీష్ కుమార్, ఆత్మకమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, అశ్వారావుపేట మున్సిపల్ చైర్మన్ జూపల్లి శశికళ, వైస్ చైర్మన్ జూపల్లి రమేష్, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, ఎంపీడీవో అప్పారావు, సీఐ నాగరాజు రెడ్డి, స్టేషన్ హౌస్ ఆఫీసర్ యయాతి రాజు, తదితరులు పాల్గొన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
గురువారం
16 ఏప్రిల్ 2026

## వైభవపేతంగా భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ శోభాయాత్ర

**జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించిన పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ**




**కూకట్ పల్లి, :**
ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నీరుడు రాజు ఆధ్వర్యంలో ఎల్లమ్మబండలో భారతరత్న బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా అంబేద్కర్ శోభాయాత్ర వైభవోపేతంగా నిర్వహించారు. ఇట్టి శోభాయాత్రకు ముఖ్య అతిథిగా విచ్చేసిన పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ తో కలిసి జండా ఊపి శోభాయాత్రను ప్రారంభించారు. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మాట్లాడుతూ ప్రపంచ దేశాల రాజ్యాంగాలను పరిశీలించి రాజ్యాంగ సవరణలను విశ్లేషించి మన దేశానికి రాజ్యాంగాన్ని అందించిన బాబాసాహెబ్ అంబేద్కర్ నేటి భారతదేశ యువతకు ఆదర్శంగా ఉన్నారని, ఆయన ఆశయాలను కొనసాగించే దిశగా యువతరం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎల్లమ్మ బండ యువత భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్ల అమలుకు కొత్త దిశగా కేంద్ర ప్రభుత్వం

**-మహిళల రాజకీయ సాధికారతకు కీలక అడుగు**

**-జిల్లా ప్రధాన కార్యదర్శి నౌబాద్ జగన్నాథ్**



**జహీరాబాద్**
పార్లమెంట్‌లో నారీ శక్తి వందన్ అధినియం ద్వారా 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 16వ తేదీన ప్రవేశపెట్టనున్నారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నౌబాద్ జగన్నాథ్ బుధవారం తెలిపారు.జహీరాబాద్ అసెంబ్లీ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన ఎన్నో ఏళ్లుగా ఈ బిల్లును మహిళలు ఎదురుచూస్తున్నారని అన్నారు. ఈ బిల్లు అమలైతే రాజకీయాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ లభిస్తుందని చెప్పారు.పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఈ నెల 16, 17, 18 తేదీల్లో జరగనున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్‌తో సహా కొన్ని పార్టీలు గతంలోఈబిల్లునువ్యతిరేకించాయని ఆయన ఆరోపించారు. మోదీ ప్రభుత్వం ఈ బిల్లును సుసాధ్యం చేస్తుందని, చట్టం చేయడమే కాకుండా అమలుపైనా కసరత్తు జరుగుతోందని తెలిపారు.పార్టీలకతీతంగా బిల్లుకు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. 2029 ఎన్నికల నాటికి 33 శాతం రిజర్వేషన్లు అమలవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. డీలిమిటేషన్ పూర్తయితే తెలంగాణ నుంచి పార్లమెంట్, అసెంబ్లీలో మహిళల ప్రాతినిధ్యం గణనీయంగా పెరుగుతుందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీలకూ మెరుగైన అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

## ఉపాధి కూలీల సంక్షేమమే లక్ష్యం : సర్పంచ్ పంజ స్వామి.

**- ఉపాధి కూలీలకు సౌకర్యాల పంపిణీ.**

**- జిల్లాలో గుర్తింపు సాధించిన గ్రామం.**





**దౌల్తాబాద్ ఏప్రిల్ 15**
దౌల్తాబాద్ మండలం గాజులపల్లి గ్రామం లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనుల ప్రదేశంలో ఉపాధి కూలీలకు అవసరమైన మౌలిక సదుపాయాలను గ్రామ సర్పంచ్ పంజ స్వామి పంపిణీ చేశారు. కూలీలు సురక్షితం గా, సౌకర్యవంతంగా పనిచేయాలనే ఉద్దే శంతో వాటర్ బబుల్స్, జగ్గులు, ప్రథమ చికిత్స పెట్టెలు, ప్రతి గ్రూపుకు ఒక స్టాంప్ ప్యాడ్, పెన్నులు అందజేశారు. ఈ సంద ర్భంగా గ్రామ సర్పంచ్ పంజ స్వామి మా ట్లాడుతూ, ఉపాధి హామీ పథకం అమలులో మన గ్రామం జిల్లాలోనే మంచి గుర్తింపు సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. కూలీల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. గ్రామాభివృద్ధిలో ఉపాధి కూలీల పాత్ర ఎంతో ముఖ్యమని, వారి కృషి వల్లే గ్రామానికి మంచి పేరు వచ్చిందని కొనియాడారు. అదే విధంగా, ఉపాధి హామీ పనుల అమలులో కీలక పాత్ర పోషించిన ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింలును ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను ప్రశంసిస్తూ, భవిష్యత్తులో కూడా ఇదే విధంగా కృషి కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి హంసకేతన్, ఉపాధి కూలీలు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 'అరైవ్ ఆలైవ్' అవగాహన కార్యక్రమం

- ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనను తప్పకుండా పాటించాలి
- తొందరపాటు, అతివేగం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి
- ప్రాణం ఎంతో విలువైంది దాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత
- కూకట్ పల్లి అదనపు డీసీపీ సుదర్శన్





**కూకట్ పల్లి :**
సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో బుధవారం కూకట్ పల్లి జెనెసిస్ స్కూల్‌లో కూకట్ పల్లి పోలీసుల ఆధ్వర్యంలో 'అరైవ్ ఆలైవ్' కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్ పల్లి అదనపు డీసీపీ సుదర్శన్ ముఖ్య అతిథిగా హాజరై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవన విధానంలో మార్పులు, సరైన నిద్ర లేకపోవడం, తొందరగా వెళ్లాలనే ఆలోచనల వల్లే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. మానవ ప్రాణం ఎంతో అమూల్యమైనదని, దానిని కాపాడుకోవడం అలాగే తమపై ఆధారపడి ఉన్న కుటుంబాన్ని రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. "స్టార్ట్ ఎర్లీ – గో స్లోలీ – రీచ్ సేఫ్లీ" అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ గుర్తు పెటుకొని సురక్షితంగా ప్రయాణం సాగించాలని సూచించారు. హెల్మెట్ ధరిస్తే జుట్టు రాలిపోతుందనే అపోహతో కొందరు హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తున్నారని, అయితే హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే ప్రాణాలకే తీవ్రమైన ప్రమాదం పొంచి ఉంటుందని హెచ్చరించారు. విద్యార్థులు, యువత ఎక్కువగా రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకొని ఈ తరహా అవగాహన కార్యక్రమాలను ప్రత్యేక శ్రద్ధతో నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జెనెసిస్ స్కూల్ విద్యార్థులు, కూకట్ పల్లి లా & ఆర్డర్ ఎస్ హెచ్ ఓ వెంకట సుబ్బారావు, కూకట్ పల్లి ట్రాఫిక్ ఎస్ హెచ్ ఓ తిమ్మప్ప, పోలీసు అధికారులు, సిబ్బంది, ఇతరులు

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరత - పేదల ప్రాణాలతో ప్రభుత్వ నిర్లక్ష్యం సరికాదు

**-ఆరోగ్య రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించే కుట్రను తక్షణమే ఆపాలి**

**-రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ప్రభుత్వ ఆసుపత్రులలో అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాలి**

**-ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి**



**ఉప్పల్ ,.:**
రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో తీవ్రమైన మందుల కొరత నెలకొనడం పట్ల ఏఐవైఎఫ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నదని, పేదలు, మధ్యతరగతి ప్రజలకు ఆధారపడే ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థను ఉద్దేశపూర్వకంగా బలహీనపరుస్తూ, కార్పొరేట్ ఆసుపత్రులకు లాభాలు చేకూర్చే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ తక్షణమే ప్రభుత్వ ఆసుపత్రులలో అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో కోఠి లోని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ సంచాలకులు బి. రవీంద్ర నాయక్ కు ఏఐవైఎఫ్ బృందం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్రలి. మాట్లాడుతూ జ్వరం, షుగర్, బీపీ వంటి సాధారణ వ్యాధులకు అవసరమైన ప్రాథమిక మందులు కూడా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో లేకపోవడం అత్యంత దారుణమన్నారు. Paracetamol (జ్వరం), Ibuprofen (నొప్పి), Pantoprazole (అమ్లత్వం), Antibiotics (Amoxicillin, Azithromycin) ఇవి రోజూ అవసరమయ్యే మందులు.... దీర్ఘకాలిక వ్యాధుల మందులు BP మందులు (Telmisartan, Amlodipine), Diabetes eT+<ŠT\T (Metformin, Glimepiride), Heart మందులు (Clopidogrel) వీటి కొరత వల్ల పేషెంట్లకు రెగ్యులర్ ట్రీట్మెంట్ ఆపేస్తున్నారని వారు ధ్వజమేత్తారు. స్పెషలైజ్డ్ మందులు (Life-saving / hospital use) కొన్ని హాస్పిటల్స్‌లో లేవని Labetalol (BP emergency), Alprazolam (mental health), Norfloxacin (infection), Trypsin-chymotrypsin (wound healing)వంటి అత్యవసర మందుల లేమితో పేషంట్లు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్లు ప్రిస్క్రిప్షన్ ఇచ్చినా, మందులు లేకపోవడంతో రోగులు బయట ప్రైవేట్ మెడికల్ షాపుల్లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోందని . ఇది పేదలపై ఆర్థిక దాడి మాత్రమే కాకుండా, వారి ఆరోగ్య హక్కులను బహిరంగంగా తుంగలో తొక్కడమేనన్నారు . ప్రభుత్వం ఆరోగ్య రంగానికి భారీ నిధులు కేటాయిస్తున్నట్లు ప్రచారం చేసుకుంటూ, కింది స్థాయి వాస్తవాలను పూర్తిగా విస్మరిస్తోందన్నారు . మందుల కొనుగోలు, సరఫరా వ్యవస్థలో అవినీతి, నిర్వాకం, మధ్యవర్తుల దోపిడీ వల్ల ప్రజలకు మందులు అందడం లేదన్నారు. ఇది కేవలం పరిపాలనా వైఫల్యం కాదని --- పేదలపై వ్యవస్థాపిత దాడి అని వారు విమర్శించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరతపై హై లెవల్ జ్యుడీషియల్ విచారణ జరపాలని,అన్ని ప్రాథమిక మరియు ప్రాణరక్షక మందులను తక్షణమే ఉచితంగా అందుబాటులోకి తీసుకురావాలని, మందుల కొనుగోలు, సరఫరాలో జరిగిన అవినీతిపై బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, కార్పొరేట్ ఆసుపత్రులకు లాభం చేకూర్చే విధానాలను వెంటనే నిలిపివేయాలని, ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేసి, ప్రతి పౌరుడికి ఉచిత, నాణ్యమైన వైద్యం హక్కుగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించకపోతే, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు నేర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి. సత్య ప్రసాద్, రాష్ట్ర సమితి సభ్యులు షేక్ మహమూద్ పాల్గొన్నారు.

## రామగుండంలో దోస్త్ షార్ట్ ఫిలిం షూటింగ్ ప్రారంభం

**:- యువతకు మార్గదర్శకంగా నిలిచే కథతో ముందుకొచ్చిన సినీ బృందం**





**గోదావరిఖని,ఏప్రిల్ 15 :**
రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో సృజనాత్మక రంగానికి మరింత ఉత్సాహాన్ని నింపుతూ "దోస్త్" లఘు చిత్ర చిత్రీకరణ బుధవారం ఘనంగా ప్రారంభమైంది.పల్లవి చరణం మీడియా క్రియేషన్ బ్యానర్పై రూపొందుతున్న ఈ చిత్రం షూటింగ్ను బి పవర్ హౌస్ హనుమాన్ జంక్షన్ వద్ద ప్రారంభించారు.ప్రారంభోత్సవ వేడుకకు సినీ,మీడియా రంగాలకు చెందిన ప్రముఖులు హాజరై సందడి చేశారు. ఈ చిత్రాన్ని రామగుండానికి చెందిన సీనియర్ ఫోటోగ్రాఫర్, దర్శకుడు మోదుంపల్లి రామస్వామి రూపొందిస్తున్నారు. సమాజానికి సందేశం అందించే కథాంశంతో రూపొం దుతున్న "దోస్త్" చిత్రం,నేటి యువతలో స్నేహం, బాధ్యత, విలువల ప్రాముఖ్యతను ప్రతిబింబించేలా ఉంటుందని దర్శకుడు తెలిపారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరైన డైరెక్టర్ వర్మ,గోదావరిఖని సీనియర్ జర్నలిస్టు దయానంద్ గాంధీ,సినీ రచయిత దయ నర్సింగ్,దర్శకుడు దామెర శంకర్ చిత్ర బృందాన్ని అభినందించారు. క్లాప్ కొట్టి చిత్రీకరణ ప్రారంభించిన వారు సందేశాత్మక చిత్రాలు సమాజంలో మార్పుకు దోహదపడతాయని పేర్కొన్నారు. వక్తలు మాట్లాడుతూ ప్రస్తుతం యువత ఎక్కువగా వినోదానికి మాత్రమే పరిమితమవుతున్న నేపథ్యంలో ఇటువంటి సందే శాత్మక చిత్రాలు వారికి సరైన దిశను చూపగలవని తెలిపారు. ముఖ్యంగా పారిశ్రామిక ప్రాంతాల్లో ఉన్న యువతకు అవకాశాలు కల్పిస్తూ,వారి ప్రతిభను వెలికితీసే ప్రయత్నం చేస్తున్న దర్శకుడు రామస్వామిని ప్రశంసించారు. ఈ లఘు చిత్రంలో స్థానికులకు ప్రతిభ కలిగిన వారికి ప్రాధాన్యం కల్పించారు. నటీనటులుగా భూమయ్య,కంది నాగరాజు తమ పాత్రలతో ఆకట్టుకోనుండగా,కెమెరామెన్ కార్తీక్ తన చిత్రీకరణ నైపుణ్యంతో సినిమాకు ప్రత్యేక అందాన్ని తీసుకురానున్నారు. శ్రీలత తదితరులు కూడా ఈ చిత్రంలో ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. సాంకేతిక నైపుణ్యం, భావో ద్వేగాలతో కూడిన కథ,యువతను ఆలోచింపజేసే సందే శంతో "దోస్త్" లఘు చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం ద్వారా రామగుండం ప్రాంతం నుంచి మరిన్ని ప్రతిభలు వెలుగులోకి రావాలని సినీ ప్రముఖులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నటీనటులు గొల్లపల్లి రామలింగం,రాయి వేణుగోపాల్,సుమలత యాదవ్, డుగ్గు, విన్ను,సర్వర్,బాయ్ శ్రీనివాస్,వెంకటేశం, అసిస్టెంట్ కెమెరా సాయి,డాక్టర్ రాజు,నిర్మాత రచన దర్శకత్వం మొదుంపల్లి రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co